ప్రజాశక్తి

గురువారం 30 జనవరి 2025

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

ఉత్సాహంగా రక్షణ జాతా

◆ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి : సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం

లంకెలపాలెంలో జాతానుద్దేశించి మాట్లాడుతున్న లోకనాథం

ప్రజాశక్తి - పరవాడ, అనకాపల్లి

సిపిఎం రాష్ట్ర 27వ మహాసభ ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు నెల్లూరులో జరగనున్న నేపథ్యంలో పార్టీ ఆధ్వర్యాన విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకు మంగళవారం కూర్మన్నపాలెం నుంచి చేపట్టిన రాష్ట్ర జాతా బుధవారం అనకాపల్లి జిల్లా లంకెలపాలెం, అనకాపల్లి మీదుగా ఉత్సాహంగా సాగింది. పరవాడ మండలం లంకెలపాలెం జంక్షన్ వద్ద జాతాకు బుధశారం సిపిఎం నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సభలో లోకనాథం మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ పరిష్కారం కాదని, ప్రయివేటీకరణ చేయనని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్యాకేజీ కింద రూ.11,400 కోట్లు ఇచ్చి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అదానీకి అమ్మాలని చూస్తున్నారని మండిపడ్డారు. సెయిల్‌లో విలీనం చేస్తే 40 వేల ఉద్యోగాలు వస్తాయని, ఈ ప్రాంతం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. అటువంటి చర్యలు చేపట్టకుండా ప్రయివేటీకరణ చేయాలనే దూర దృష్టితోనే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్యాకేజీ ఇస్తుందని తెలిపారు. నెల్లూరులో జరిగే రాష్ట్ర మహాసభల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం గత ఉద్యమాలను సమీక్షించి, భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు నిర్మించడానికి కార్యక్రమాలు రూపొందిస్తామని తెలిపారు. అనంతరం జాతా అనకాపల్లి వైపు సాగింది. అనకాపల్లి చిన నాలుగు రోడ్లు జంక్షన్‌లోని బాటా సెంటర్ వద్ద జాతాకు సిపిఎం నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. సిపిఎం అనకాపల్లి మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభలో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు మిగతా 2లో..

ఎమ్మెల్సీ ఎన్నికల నగరా

◆ 3న నోటిఫికేషన్ ◆ 27న పోలింగ్

◆ మార్చి 3న ఓట్ల లెక్కింపు

◆ జిల్లాలో అమల్లోకి ఎన్నికల ప్రవర్తనా నియమావళి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలోని రెండు పట్టభద్రులు, ఒక టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం తేదీలను ఖరారు చేసింది. దీంతో ఉత్తరాంధ్రలో టీచర్ ఎమ్మెల్సీ పోటీ రసవత్తరంగా మారే అవకాశం కనిపిస్తోంది. ఫిబ్రవరి 27న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్‌కు సంబంధించిన నోటిఫికేషన్ ఫిబ్రవరి 3న వెలువడనుంది. ఎన్నికల కోడ్ తక్షణం అమల్లో ఉంటుందని అధికార యంత్రాంగం బుధవారం సాయంత్రం ప్రకటించింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ఉపాధ్యాయుల నియోజకవర్గం సభ్యుల కాలపరిమితి, అదే విధంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం సభ్యుల కాలపరిమితి మార్చి 29తో పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల సభ్యుల ఎన్నికలను ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఈ రెండు నియోజకవర్గాలకు ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ కానుంది. 10వ తేదీ వరకూ నామపత్రాలు సమర్పించవచ్చు. 11వ తేదీన నామ పత్రాల పరిశీలన, 13వ తేదీలోగా నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. ఫిబ్రవరి 27వ తేదీ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ పోలింగ్ ఉంటుంది. మార్చి 3న కౌంటింగ్ నిర్వహిస్తారు.

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థిగా కోరెడ్ల విజయగౌరి

ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం నుంచి ప్రోగ్రెసివ్ డెమక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థిగా ఈ ప్రాంతంలో అనేక ఉపాధ్యాయ, ఉద్యోగ, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పోరాటాలకు నాయకత్వం వహించిన కోరెడ్ల విజయగౌరి టీచర్ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నారు. టీచర్ ఉద్యోగానికి విజయగౌరి స్వచ్ఛంద విరమణచేసి ఉద్యోగ, ఉపాధ్యాయ హక్కుల కోసం ఉత్తరాంధ్రలో గళం విప్పుతున్నారు. 2025 మార్చిలో జరిగే ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనేక సంఘాల మద్దతుతో బరిలోకి దిగుతున్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించిన స్టీల్ సెక్రటరీ

▶ వార్త 2లో..

నేటి నుంచి ఆర్థోపెడిక్ వర్క్ షాప్

▶ వార్త 2లో..

డిఆర్ఎం కార్యాలయం వద్ద లోకో పైలట్ల నిరసన

▶ వార్త 2లో..

వరి నూర్పిడి యంత్రం బోల్తా : ఇద్దరు మృతి

▶ వార్త 3లో..

ఉత్సాహంగా.. ఉత్తేజంగా..

-ఘనంగా ప్రారంభమైన ఎస్ఎఫ్ఐ వైజాగ్ స్టూడెంట్స్ కల్చరల్ ఫెస్ట్

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : ఎస్ఎఫ్ఐ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఆంధ్రా యూనివర్సిటీ అంబేద్కర్ అసెంబ్లీ హాల్‌లో బుధవారం స్టూడెంట్ కల్చరల్ ఫెస్ట్ ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజులపాటు జరగనున్న ఈ సాంస్కృతిక సంబరానికి వేలాదిగా విద్యార్థులు తరలివచ్చారు. విద్యార్థుల ఆటపాటలతో వేదిక దద్దరిల్లింది. సంప్రదాయ జానపద నృత్యాలతో విద్యార్థినులు ఆకట్టుకున్నారు. సినిమా, ఫోక్ సాంగ్స్‌కు విద్యార్థులు వేసిన స్టెప్పులకు చప్పట్ల వర్షం కురిసింది. ఫెస్ట్ ప్రారంభానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగి ఉన్న కళా ప్రతిభను వెలికితీస్తాయన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు, క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ఒత్తిడిలో ఉన్న విద్యార్థులకు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని చెప్పారు. రానున్న కాలంలో ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని చేపడతామని తెలిపారు. విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని కోరారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్‌జె.నాయుడు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ఉద్యమాలతో పాటు ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలను ఎప్పటికప్పుడు తలపెడుతోందన్నారు. సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు జి.అజయ్ మాట్లాడుతూ, ఫెస్ట్‌కు విద్యార్థుల నుంచి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా, ఆంధ్ర యూనివర్సిటీ నాయకులు పాల్గొన్నారు.

వచ్చి వెళ్లడమేనా!...తీపికబురు చెబుతారా?

◆ నేడు ఉక్కు ఫ్యాక్టరీలో కేంద్ర స్టీల్ మంత్రుల పర్యటన

◆ కార్మికుల ప్రయివేటీకరణపై పోరుకు విముక్తి లభించేనా?

◆ సెయిల్‌లో విలీనం, జీతాల సమస్య పరిష్కారం జరిగేనా?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు ప్రకటించిన తర్వాత ఉక్కు ఫ్యాక్టరీకి కేంద్ర స్టీల్, మైనింగ్ మంత్రి హెచ్‌డి కుమారస్వామి, స్టీల్ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ గురువారం పర్యటించడం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఇంతవరకూ వచ్చిపోవడం తప్ప ప్రయివేటీకరణను కేంద్రం ఉపసంహరించుకుందన్న నిఖార్సయిన ప్రకటన వెలువడలేదు. గతంలో వచ్చి వెళ్లిన మంత్రి కుమారస్వామి ప్రయివేటీకరణ ఎవరన్నారు? అంటూ ప్రశ్నించారు. కానీ కేంద్ర కేబినెట్‌లో తీర్మానం చేయించే పని ఈ 4నెలల కాలంలో చేయించలేదు. ఆ తర్వాత కార్మికుల కష్టాలు మరింత పెరిగాయని చెప్పడానికి 5 నెలలుగా జీతాలు వారికి చెల్లించకపోవడమే పెద్ద ఉదాహరణ.

పెట్టుబడుల ఉపసంహరణ ప్రకటన తర్వాత...

2021 జనవరి 27న దేశ ప్రధాని నరేంద్రమోడీ విశాఖ స్టీల్ ప్రయివేటీకరణ నిర్ణయం చేసిన నుంచీ సుమారు రూ.11వేల కోట్లకు పైగా ప్లాంట్‌కు నష్టాలు సంభవించాయి. ఇటీవల దానికి సమానమైన ప్యాకేజీ కేంద్రం ఇచ్చింది. అంటే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. ఎవరేం సాధించారు? కార్మికులైతే నష్టాల బారిన పడకుండా సొంత గనులు కేటాయించాలని లేదంటే సెయిల్‌లో ప్లాంట్‌ను విలీనం చెయ్యాలని 3ఏళ్లుగా ఢిల్లీకి తాకేలాగ ఉద్యమాలు చేస్తూనే ఉన్నారు. 7లక్షల టన్నుల ఉత్పత్తిగల కర్నాటకలోని విశ్వేశ్వరయ్య ప్లాంట్‌కు రూ.15వేల కోట్లు ఇచ్చిన స్టీల్ మంత్రి 70లక్షల టన్నుల ఉత్పత్తిగల విశాఖ స్టీల్‌కు రూ.1.50లక్షల కోట్లు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.11వేల కోట్లే ఇప్పించారన్న చర్చ సాగుతోంది. గనుల్లేనందునే నష్టాలొస్తున్నాయని ఢిల్లీలో కుమారస్వామి ప్రకటించారు. దీన్ని పరిశీలిస్తామని చెప్పారు. గనులు, ఉక్కు మంత్రి ఆయనే కాబట్టి తాజా పర్యటనలో ఏం చెబుతారో చూడాల్సిందే.

తండ్రి బాటన పయనిస్తారా?

కర్నాటకలోని విశ్వేశ్వరయ్య ప్లాంట్‌ను తండ్రి ప్రధానిగా ఉన్నప్పుడు ప్రభుత్వంలో కలిపారు. తనయుడైన మిగతా 2లో..

మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలి

ఆర్‌పిల ధర్నా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మెప్మా ఆర్‌పిల ఉద్యోగ భద్రతకు తీవ్ర విఘాతం కలిగించే మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్‌ను తక్షణం రద్దు చేయాలని, మూడు నెలల బకాయి జీతాలను వెంటనే విడుదల చేయాలని, పని ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఎపి మెప్మా ఆర్‌పి ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యాన బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. వందలాది మంది ఆర్‌పిలు పాల్గొన్న ధర్నాకు ముఖ్య అతిథిగా సిఐటియు జిల్లా నాయకులు, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు హాజరై మాట్లాడుతూ, పట్టణ ప్రాంతాల్లో పేద మహిళలను డ్వాక్రా గ్రూపుల్లోకి తీసుకొచ్చి అనేక సేవలు అందించిన ఆర్‌పిలకు ప్రభుత్వాలు ఇస్తున్న వేతనాలు చాలా తక్కువ అని, ఇస్తున్న వేతనం కూడా సకాలంలో ఇవ్వటం లేదని, తీవ్రమైన పని ఒత్తిడిని అనుభవిస్తున్నారని, ఈ వెట్టి చాకిరీ విధానాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు ముగిసిన ప్రతిసారీ ఆర్‌పిల మీద రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. ఆర్‌పిలు పార్టీ మనుషులు కాదని, ప్రభుత్వ ఉద్యోగులని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయమై ప్రత్యేక శ్రద్ధ వహించి ఆర్‌పిలందరినీ కొనసాగే విధంగా చూడాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ పోరాటాల ద్వారా ఆర్‌పిలు హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ధర్నా అనంతరం జివిఎంసి ఎడిసి, యుసిడి పీడీలకు వినతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ నాయకులు పి.మణి, మల్లీశ్వరి, లత, ఝాన్సీ, సత్య వరలక్ష్మి, దేవి, లక్ష్మి, రత్నాలు, సన్యాసమ్మ, విశాలాక్షి, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం కార్పొరేటర్ గంగారావు

నేటి నుంచి ఆర్థోపెడిక్ వర్క్ షాప్

కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : స్టేట్ ఆఫ్ ఆర్థోపెడిక్ వర్క్ షాప్‌ను ఈ నెల 30 నుంచి నాలుగు రోజులపాటు నగరంలో నిర్వహిస్తున్నట్లు కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద తెలిపారు. బుధవారం కెజిహెచ్ సూపరింటెండెంట్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 30 నుంచి 2వ తేదీ వరకు విఎంఆర్‌డిఎ చిల్డ్రన్ ఎరీనాలో వర్క్ షాప్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఒఎస్ఎస్ఎపిసిఒఎన్-2025 ఎక్సలెన్స్ ఎక్రాస్ ఆల్ డైమెన్షన్స్ ఆఫ్ ఆర్థోపెడిక్స్ అనే నినాదంతో వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్క్ షాప్‌లో వెయ్యి మంది ఆర్థోపెడిక్ వైద్యులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఫిబ్రవరి 1న రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. జాతీయ, అంతర్జాతీయ ఆర్థోపెడిక్ ఫ్యాకల్టీ భాగమవుతారని, 400 మంది పత్రాలను సమర్పిస్తారని తెలిపారు. ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ అంబేద్కర్‌కు లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ పురస్కారాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఆర్థోపెడిక్ వైద్యులు, పద్మశ్రీ సుంకర ఆదినారాయణను సన్మానించనున్నట్లు తెలిపారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించిన స్టీల్ సెక్రటరీ

ప్రజాశక్తి -ఉక్కునగరం (విశాఖపట్నం)

కేంద్ర స్టీల్, మైనింగ్ మంత్రి హెచ్‌డి కుమారస్వామి, స్టీల్ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ గురువారం విశాఖ స్టీల్‌ప్లాంట్ పర్యటన నేపథ్యంలో కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం విశాఖపట్నం వచ్చారు. ఆయన నేరుగా విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ కార్పొరేట్ సంస్థ అయిన రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్‌కు వెళ్లారు. ఆర్ఐఎన్ఎల్ ఇన్‌ఛార్జి సిఎమ్‌డి అజిత్ కుమార్ సక్సేనాతో సహా ప్లాంట్ ఉన్నతాధికారులతో బుధవారం చర్చలు జరిపారు. స్టీల్‌ప్లాంట్‌లో వివిధ విభాగాలను సందర్శించారు. బ్లాస్ట్ ఫర్నేస్ -3తో పాటు ఉత్పత్తి జరిగే వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. మౌలిక సదుపాయాలు, మానవ వనరులు, తయారీపై ఉక్కు కార్యదర్శికి ఆర్ఐఎన్ఎల్ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ట్రేడ్ యూనియన్ నాయకులు, స్టీల్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ ప్రతినిధులను సందీప్ పౌండ్రిక్ కలవడం లేదని స్టీల్‌ప్లాంట్ వర్గాలు తెలిపాయి. మంత్రుల రాక నేపథ్యంలో విశాఖ ఉక్కు కర్మాగారం భవిష్యత్తుకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకోవచ్చని కార్మికులు ఆశాభావంతో ఉన్నారు.

మొదటి పేజీ తరువాయి..

ఉత్సాహంగా రక్షణ జాతా

యు.రామస్వామి మాట్లాడుతూ, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలని చూడకపోతే సెయిల్ విలీనం చేయడానికి అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. విలీనానికి సెయిల్ అథారిటీ ఒప్పుకోలేదని కాకమ్మ కథలు చెబుతున్నారని విమర్శించారు. రెండు ప్రభుత్వ రంగ సంస్థలే అయినప్పుడు విలీనానికి అభ్యంతరం ఎందుకని ప్రశ్నించారు. ఆయా కార్యక్రమాల్లో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు ఎన్.రామారావు, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఆర్.శంకరరావు, వివి.శ్రీనివాసరావు, బి.ఉమామహేశ్వరరావు, అల్లు రాజు, పి.శ్రీనివాసవరావు, కాళ్ల తేలయ్యబాబు, టి.సురేష్, కాపుశెట్టి అప్పారావు, జి.నర్సింగరావు, చలపతి, ఎం.రమణ, కరణం వెంకటరావు, డి.దేముడు, శ్రీను, రాము, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

వచ్చి వెళ్లడమేనా!... తీపికబురు చెబుతారా?

కుమారస్వామి రూ.15వేల కోట్లు ఇప్పించారు. వైజాగ్ స్టీల్ విషయంలో ఇదే బాటన పయనించాలని కార్మికులు కోరుకుంటున్నారు. కుదిముక్ ఐరన్ ఓర్ కంపెనీ (కెఐఓసి) విశాఖ ప్లాంట్‌లో 250 ఎకరాలు పెల్లెట్స్ ప్లాంట్ కోసం అడగడం మంచిపరిణామమని స్టీల్ మంత్రి ఈ ప్రతిపాదనపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని విశాఖ స్టీల్ కార్మికులు కోరుతున్నారు.

నేడు అధికారులతో మంత్రుల భేటీ..

గురువారం ఉదయం 9 గంటలకు విశాఖ విమానాశ్రయానికి మంత్రులిద్దరూ చేరతారు. అనంతరం స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లి అధికారులు, కార్మిక ప్రతినిధులతో చర్చించనున్నారు. జీతాల సమస్యపై యాజమాన్యానికి ఒక డైరెక్షన్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఓలా డ్రైవర్లకు అభినందనలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఓలాలో కొత్తగా ప్రవేశపెట్టిన బ్రాడ్ కాస్ట్ (రాడార్) ట్రిప్స్ విధానం వల్ల చాలా ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నందున, దీనిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పోరాడిన డ్రైవర్ల అభ్యర్థనను మన్నించి రద్దు చేశారు. దీంతో డ్రైవర్లు విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు బి.జగన్ మాట్లాడుతూ ముందుగా డ్రైవర్లకు అభినందనలు తెలిపారు. గతంలో ఒక బుకింగ్ ఒక డ్రైవర్‌కు మాత్రమే వెళ్లేదని, ఆ బుకింగ్ మొబైల్ స్క్రీన్‌పై ఎక్కువసేపు ఉండేదన్నారు. రాడార్‌తో ఒక బుకింగ్ ఐదుగురు డ్రైవర్లకు వెళుతుందని, మొబైల్ స్క్రీన్‌పై ఒక్క సెకండ్‌లో పోతుందని, ఎవరు ముందుగా యాక్సెప్ట్ చేస్తే వాళ్లకి బుకింగ్ ఓకే అవుతుందని తెలిపారు. దీంతో డ్రైవర్లు బుకింగ్ కోసం అదేపనిగా మొబైల్ చూస్తూ ఉండాల్సి వచ్చేదని వివరించారు. అందువలన ఈ రాడార్ ట్రిప్స్ తీసివేయాలని సోమవారం నుంచి వైజాగ్ సిటీలో తిరిగే డ్రైవర్స్ ఓలా బంద్ చేయడంతో యాజమాన్యం బుధవారం చర్చలకు ఆహ్వానించి, ఒక బుకింగ్ ఇద్దరు డ్రైవర్లకు వచ్చే విధంగా, మొబైల్ స్క్రీన్ పై ఒక బుకింగ్ 15 సెకండ్‌లు ఉండే విధంగా 10 రోజులలో మార్పు చేస్తామని ఒప్పందం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, పోలినాయడు, నాయకులు ఆనంద్, అబ్బాయి, శ్రీను, నాయుడు, పాల్గొన్నారు.

1/70పై స్పీకర్ వ్యాఖ్యలు తగవు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : 1/70 చట్ట సవరణతోనే గిరిజన ప్రాంతాల్లో పెట్టుబడులు వస్తాయని విశాఖపట్నం కేంద్రంగా నిర్వహించిన ప్రాంతీయ పెట్టుబడుదారుల సదస్సులో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను ఆదివాసి గిరిజన సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు కిముడు చిన్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి జివిఆర్ మూర్తి బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఈ వ్యాఖ్యలు పూర్తిగా బాధ్యతారహితమైనవని పేర్కొన్నారు. ఇప్పటికే ఏజెన్సీలో భూములకు రక్షణ కొరవడిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాజకీయ రాబందుల భూ కబ్జాలను నిరోధించడానికి గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ చట్టాన్ని సవరణ చేస్తే ఆదివాసి సహజ వనరులను, ఖనిజాలను, అడవులను పెట్టుబడిదారులు కార్పొరేట్లు స్వాధీనం చేసుకుని వ్యాపారం సాగిస్తారని, తద్వారా ఆదివాసి జీవన విధానం ధ్వంసం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది స్పీకర్ ప్రకటనా లేక టిడిపి విధానమా అన్నది స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన చట్టాలను కాలరాయాలని చూస్తే వాటిని కాపాడుకునేందుకు ఆదివాసి గిరిజన ఉద్యోగ, ప్రజాసంఘాలు ముందు ఉంటాయని స్పష్టంచేశారు.

లోకో పైలట్ల నిరసన

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖపట్నం డివిజనల్ రైల్వే మేనేజర్ (డిఆర్ఎం) కార్యాలయం ఎదుట బుధవారం లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు, ట్రెయిన్ మేనేజర్లు సంయుక్తంగా మౌన నిరసన చేపట్టారు. ఈ నిరసన అనంతరం సాధన నాయకులు ఆర్‌విఎస్ఎస్.రావు మాట్లాడుతూ, రెండేళ్ళుగా మినిమం గ్యారెంటీడ్ కిలోమీటర్ల కోసం తమ పోరాటం కొనసాగుతోందని తెలిపారు. మైలేజ్ కారణంగా ఉద్యోగులకు వచ్చే అలవెన్సులు నష్టపోతున్నామని, సమయ పాలనకు అనుగుణంగా గతంలో ఇచ్చిన విధంగా అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మినిమం గ్యారెంటీడ్ కిలోమీటర్లను డ్యూటీ ప్రారంభం నుంచి 120 కిలోమీటర్లుగా నిర్ణయించి, అలవెన్సులు అందించాలని కోరారు. ఈ డిమాండ్ నెరవేరే వరకు నిరసనలను ప్రతిరోజూ కొనసాగిస్తామని, డిఆర్ఎం సానుకూలంగా స్పందించకపోతే విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు.

హమ్ హై హిందుస్థానీ పాటకు విశేష ఆదరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న డైరెక్టర్, రచయిత సుధీప్ సాయి తన సినిమా "సబ్‌కా మాలిక్ ఏక్ హై" నుంచి "హమ్ హై హిందుస్తానీ" అనే పాటను యూట్యూబ్ ఛానెల్‌లో విడుదల చేశారు. ఈ పాటకు ప్రజల నుండి అద్భుతమైన సానుకూల స్పందన లభించిందని, సుధీప్ సాయి మీడియాకు తెలిపారు. ఈ పాటను తంగిశెట్టి జ్యోతి సాయి (సుధీప్ సాయి) రచించగా, ప్రమోద్ కుమార్ పారిశర్లా సంగీతం సమకూర్చారు. ఆర్‌జె మధు కార్తిక్ ఈ పాటను గానం చేశారు.

IN THE HONOURABLE COURT OF VII ADDITIONAL DISTRICT JUDGE CUM III METRO POLITAN SESSIONS JUDGE AT VISAKHAPATNAM
I.A. No. 741/2023 in O.S. No.538/2016

Between:
1. Smt. Dekkatha Nookalamma & others
...Petitioners/Plaintiffs
And
Dekkatha China tata & others
...Respondents/Defendants

NOTICE

To
R-3) Boyi Bangaramma
W/o. **Appanna,** R/o. Komatipalem Village Boddapalem post, Gambheeram Panchayathi, Anandapuram Mandal, Visakhapatnam District.,

Please take Notice that the above Named Petitioners/Plaintiffs has instituted the above I.A.against you and the same stands posted to **20-02-25 at 10.30A.M.** for your appearance, on that day you are Personally or through Advocate attend before the Hon`ble Court at **10.30A.M** failing which the matter will be heard and determined in your absence exparte as per law.

Y. NARSINGA RAO
B. APPALAREDDY
Advocates, VISAKHAPATNAM
Cell: 9391360473

IN THE HON'BLE COURT OF THE JUNIOR CIVIL JUDGE:ICHAPURAM.
O.S. 19/2022.

Between:
Sirla Kamesh .....Plaintiff
And:
Smt. M.R. Bhagavati and 9 others.
.....Defendants

NOTICE TO THE DEFENDANT No.2 UNDER ORDER 5 RULE 20 C.P.C.

To,
Defendant No. 2.
Smt. Ruthu Guruswamy, W/o G. Babuji Swamy, R/o Door No. 15-19, Vadlapuri R.H. Colony, Near Z.P.H., School, Duvvada, Visakhapatnam, Andhra Pradesh, Pin:- 530046.

Please take notice that the plaintiff has filed the above suit against you for partition and the same is posted to **17-02-2025 for your appearance at 10-30 A.M.** before the Hon'ble Court of the Junior Civil Judge, Ichapuram and you are to appear in person or through Advocate, failing which the matter will be decided in your absence.

// BY ORDER//

MONOJ KUMAR SAMONTO
ADVOCATE,
ICHAPURAM,
SRIKAKULAM DISTRICT,
ANDHRA PRADESH.

మహారాజశ్రీ నర్సీపట్నం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No. 180 / 2021

వాది: గవిరెడ్డి సంధ్య
ప్రతివాదులు: 1.అనిమిరెడ్డి నారాయణమ్మ 2. అనిమిరెడ్డి యశ్వంత్

CPC ఆర్డరు 5 రూలు 20 ప్రకారము 2వ ప్రతివాది / రెస్పాన్డెంట్‌కు అప్పీలు నోటీసుల ప్రకటన

2వ ప్రతివాది / రెస్పాన్డెంట్:
అనిమిరెడ్డి యశ్వంత్, తండ్రి లేటు అనిమిరెడ్డి ఎర్రన్న, శా॥ కొండల అగ్రహారం గ్రామం, మాకవరపాలెం మండలం, అనకాపల్లి జిల్లా.

పై నెంబరు పిటిషన్‌లో 2వ ప్రతివాది/ రెస్పాన్డెంట్ అయిన మీకు పలు పర్యాయములు కోర్టు నుండి మరియు రిజిష్టరు పోస్టు ద్వారానూ పిటిషన్ నోటీసులు పంపినప్పటికీ మీరు అందుకొని యుండలేదు. అందుపై శ్రీకోర్టు వారు మీకు పిటిషన్ నోటీసులు పత్రికా ప్రకటన ద్వారా పంపమని ఉత్తరువులు జారీ చేయించియున్నారు.

కాగా ఇందుమూలముగా మీకు తెలియ జేయునది ఏమనగా పై నెంబరు దావాను శ్రీ కోర్టు వారు తే: 06-02-2025కి వాయిదా వేయించి ఉన్నారు. తే:06-02-2025దిన మీరు స్వయంగా కాని న్యాయవాది ద్వారా గాని హాజరయి మీకు ఏమైనా ఆక్షేపణలున్న యెడల శ్రీ కోర్టు వారికి తెలియజేసుకోనవలెను. లేనియెడల మీకు ఎట్టి ఆక్షేపణలు లేవని ఎంచి మీ పరోక్షములో శ్రీకోర్టు వారు తమ ముందున్న దస్తావేజుల ఆధారముగా తీర్పు చెప్పదరు.

వాయిదా తేది: 06-02-2025

మెట్ట ప్రభాకర్
న్యాయవాది, నర్సీపట్నం
సెల్: 8179154586
7989015974

నర్సీపట్నం
తే:29-1-25

విద్యుత్ ఛార్జీల బాదుడు!

- బిల్లులు చూసి బావురుమంటున్న వినియోగదారులు
- ట్రూ అప్, సర్దుబాటు ఛార్జీల పేరిట తడిసి మోపెడు

ప్రజాశక్తి -తగరపువలస :సర్దుబాటు, ట్రూ ఆఫ్ ఛార్జీల పేరిట తడిసి మోపెడైన విద్యుత్ బిల్లులు చూసి వినియోగదారులు బావురుమంటున్నారు. ప్రస్తుత నెలలో విద్యుత్ వాడకానికి, వచ్చిన బిల్లులకు కనుచూపు మేరలోనైనా పొంతన లేకపోవడంతో బిల్లు చూసిన వెంటనే షాక్ కొట్టినట్లు బిగుసుకు పోతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, గత ప్రభుత్వం ఎనిమిది సార్లు కరెంటు బిల్లులు పెంచిందని బాదుడే బాదుడు అంటూ గగ్గోలు పెట్టి ప్రచారం చేసిన కూటమి పార్టీలు, తాము అధికారంలోకి వస్తే కరెంట్ ఛార్జీలు పెంచేది లేదంటూ తేగేసి చెప్పడంతో ప్రజలంతా నమ్మి, గంపగుత్తగాటట్టేసి భారీమెజార్టీతో గెలిపించామని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత పాత ప్రభుత్వ పంథాను అనుసరిస్తూ విద్యుత్‌ఛార్జీలను విపరీతంగా పెంచడంతో వినియోగదారులు విమర్శలు గుప్పిస్తున్నారు. పేదల అవస్థలను దృష్టిలో పెట్టుకుని బిల్లుల భారం తగ్గించాలని కోరుతున్నారు.

చలికాలంలోనూ బిల్లు బాదుడు

చలికాలంలో కరెంట్ వాడకం తగ్గినప్పటికీ, బిల్లు ఎక్కువగా వచ్చింది. ఫ్యాన్ వాడకం దాదాపు లేకపోయినా కరెంట్ బిల్లు షాక్ కొట్టింది. నవంబర్‌లో రూ 615, డిసెంబర్ లో రూ 564, జనవరిలో రూ 475 బిల్లు వచ్చింది.

నీలాటి రాము, ఆటో డ్రైవర్
తగరపువలస

వాడకం తక్కువ...బిల్లు ఎక్కువ

ఒక టివి, రెండు ఫ్యాన్లు, ఫ్రిజ్ మాత్రమే ఉన్నాయి. చలి కాలం. ఫ్యాన్లు వాడకం తక్కువే. అయినా సరే డిసెంబర్‌లో రూ 1062 బిల్లు వచ్చింది. నవంబర్‌లో వచ్చిన రూ 500 బిల్లుకు రెట్టింపునకు మించి బిల్లు వచ్చింది. పెరిగిన కరెంట్ బిల్లుు చూసి చెమటలు పడుతున్నాయి

-దువ్వి రమణ, ఆటోడ్రైవర్,
గొల్లవీధి, మెయిన్ రోడ్డు, తగరపువలస

అదనపు ఛార్జీలే అధికం

పెరిగిన కరెంట్ బిల్లు చూసి దిమ్మదిరిగిపోయింది. ఒక ఫ్యాన్, ఫ్రిజ్, టివి మాత్రమే వాడుతున్నా జనవరిలో ఎఫ్‌ఎఫ్‌సిఎ చార్జీలు రూ 49, రూ.25ఉన్నాయి. మొత్తంగా రూ 298 వచ్చింది. గతనెల వచ్చిన బిల్లులోనూ ఇదే పరిస్థితి.

- నీలాటి సూరిబాబు
భవన నిర్మాణ కార్మికుడు
తగరపువలస

షాక్ కొట్టిన కరెంట్ బిల్లు

కరెంట్ బిల్లు చూసి షాక్‌కు గురయ్యాం. డిసెంబర్ నెలలో రూ 2,470లు, జనవరిలో రూ.921 కరెంట్ బిల్లు వచ్చింది. నా భర్త ముఠాకార్మికుడు. మేమంతా ఇంట్లో ఉండడం, కరెంట్ వాడకమూ తక్కువే. ఈ స్థాయిలో బిల్లులు వస్తే ఎలా కట్టగలం.

-కె సీత
గొల్లవీధి, మెయిన్ రోడ్డు, తగరపువలస

నేరాలు ఘోరాలు

వరి నూర్పిడి యంత్రం బోల్తా : ఇద్దరు మృతి

ప్రజాశక్తి -రావికమతం : వరి నూర్పుడి యంత్రం బోల్తా పడి ఇరువురు మృతి చెందిన సంఘటన మండల కేంద్రం రావికమతంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాలు ప్రకారం... రావికమతం మెయిన్ రోడ్డులో వరి నూర్పు యంత్రం బాల్తాపడి మాడుగుల మండలం వొమ్మలి గ్రామానికి చెందిన జొన్నపల్లి నాయుడు(50), జొన్న జొన్నపల్లి గణేషులు (65) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలో మరో ఇరువురు గాయాల పాలయ్యారు. వొమ్మలి గ్రామానికి చెందిన జొన్నపల్లి రామ శివ ట్రాక్టర్ డ్రైవరుతో మాకవరపాలెం మండలం తమరం గ్రామ పరిసర ప్రాంతాలలో ఉన్న గ్రామాల్లో వరి నూర్పుడుకు ట్రాక్టర్ యంత్రం సిబ్బందితో కలిసి ఈనెల 24న వెళ్లారు. ఈనెల 28 సాయంత్రం వారు తమ పనిని ముగించుకొని తిరుగు ప్రయాణంలో రావికమతం జంక్షన్ వద్ద వొమ్మలి గ్రామం వద్ద ఎడమవైపు మలుపు తిప్పుతున్నప్పుడు నూర్పుడి యంత్రం బోల్తా పడింది . జొన్నపల్లి గణేష్, జొన్న పల్లి నాయుడు యంత్రం కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్సై రఘువర్మ సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు యువకులపై గంజాయి కేసు

ప్రజాశక్తి-పద్మనాభం. మండలంలోని పాండ్రంగి పంచాయతీ కొరపల్లి గ్రామంలో మామిడి తోటలో కిలోన్నర గంజాయితో ముగ్గురు వ్యక్తులు పద్మనాభం పోలీసులకు పట్టుపడ్డారు. యువకులను అరెస్ట్ చేసి పద్మనాభం తహశీల్దార్ కె. ఆనందరావు ముందు హాజరు పరిచారు. సిహెచ్ శ్రీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యుల నిర్లక్ష్యం వల్లే కోమాలోకి రోగి!

ఎంబి ఆసుపత్రి వద్ద బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - ఆరిలోవ : వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే రోగి కోమాలోకి వెళ్లాడని ఆరిలోవ హెల్త్‌సిటీ ఎంబి ఆసుపత్రి వద్ద బుధవారం ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళితే విజయనగరం జిల్లా వేపాడ మండలం, కుమ్మపల్లి గ్రామానికి చెందిన డెక్కా కృష్ణ కిడ్నీలో స్టోన్స్ ఉన్నాయని శనివారం హెల్త్‌సిటీలోని ఎంబి ఆసుపత్రిలో చేరారు. అన్ని పరీక్షలు చేసిన వైద్యులు, మంగళవారం సాయంత్రం శస్త్ర చికిత్స చేసి కిడ్నీలో స్టోన్స్ తొలగించారు. శస్త్రచికిత్స చేసి గంటన్నర అయినా బయటకు తీసుకు రాలేదని బంధువులు అడిగితే రోగికి కార్డియాక్ అరెస్ట్ అయిందని, రోగి కోమాలోకి వెళ్ళినట్టు వైద్యులు తెలిపారు. కోమాలో ఉన్న రోగిని మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. దీనికి అయ్యే ఖర్చు ఆసుపత్రి యాజమాన్యం భరిస్తుందని తెలపడంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగింది.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

ప్రజాశక్తి -తగరపువలస : మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన టెన్త్ విద్యార్థులకు చిప్పాడ దివీస్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. చిప్పాడ జెడ్‌పి హైస్కూల్‌కు చెందిన 45 మంది, తూడెం జెడ్‌పిహెచ్‌ఎస్‌కు చెందిన 50 మందికి, రావాడ జెడ్‌పి హెచ్‌ఎస్‌కు చెందిన 95 మందికి ఆయా పాఠశాలల హెచ్‌ఎంల ద్వారా స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో సిఎస్‌ఆర్ మేనేజర్ డి సురేష్‌కుమార్, ప్రతినిధులు శ్రీనివాస్, నరసింహారావు పాల్గొన్నారు

తహశీల్దార్‌కు అభినందన

ప్రజాశక్తి -పద్మనాభం : ఉత్తమ అధికారిగా జిల్లాస్థాయి గణతంత్ర పురస్కారం అందుకున్న స్థానిక తహశీల్దార్ కాకర ఆనందరావును బుధవారం మండల రెవెన్యూ కార్యాలయంలో జనసేన మండల అధ్యక్షులు కె.రామస్వామి నాయుడు, పాండ్రంగి గ్రామానికి చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు కలిసి అభినందించారు.కార్యక్రమంలో నాయకులు పల్లి మహేష్, ఎం అప్పలరమణ. పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి -పద్మనాభం: మండల వ్యవసాయాధికారి బివి.చలం ఆధ్వర్యంలో మండలంలోని వికె.పాలెం, మద్ది గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చోడి,వరి మొక్కజొన్న పంటలను పరిశీలించారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఆశించినట్లు గుర్తించి, సస్యరక్షణకు తగు సూచనలు చేశారు.

బాలల పరిశీలన గృహాన్ని సందర్శించిన రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్

ప్రజాశక్తి - ఆరిలోవ :చినగదిలి, దీనదయాల్‌పురంలోని ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహాన్ని బుధవారం రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సందర్శించారు. ఇటీవల బాలికల ప్రత్యేక గృహంలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో బాలుర పరిశీలనా గృహాన్ని సందర్శించి అక్కడ బాలురకు కల్పించిన సేవలు, సదుపాయాలపై ఆరా తీశారు. వంటకాల తయారీని స్వయంగా పరిశీలించి, వాటి రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు

ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్.అప్పారావు మాట్లాడుతూ సిబ్బంది బాలలుతో స్నేహపూర్వకంగా ఉండాలని అంకితభావం, సేవా దృక్పథంతో పనిచేయాలని కోరారు. నూతనంగా నిర్మించిన భవన సముదాయాన్ని తొందరలో వినియోగంలోకి తేవడం, చాలా కాలంగా ఖాళీగఉన్న పోస్టుల భర్తీకిఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షణ అధికారి కె.వీరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి అక్షరం-ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
అనుభవం కలిగిన
సబ్ ఎడిటర్
కావలెను
ప్రజాశక్తి కార్యాలయం
ప్లాట్ నెం.3, జి.బ్లాక్, ఆటోనగర్, ఇండస్ట్రియల్ పార్క్,
వడ్లపూడి, ఎం.వి.వి.అపార్ట్‌మెంట్ ప్రక్కన
విశాఖపట్నం-530046
ఫోన్ : 9491570765

సామాజిక సేవకు 'కోరమండల్' సహకారం

ప్రజాశక్తి -ములగాడ : పారిశ్రామిక ప్రాంత ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, సౌకర్యాల కల్పన ఇతరత్రా విభాగాల్లో సామాజిక బాధ్యతగా సహాయ, సహకారాలు అందిస్తామని కోరమండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ, కంపెనీ సిఎస్ఆర్ నిధులతో ఐదు ప్రభుత్వ పాఠశాలల్లో 80 శాతం పైబడి మార్కులు సాధించిన విద్యార్థులకు కిట్లు అందిస్తున్నామన్నారు.

కేవలం రూ.పది కన్సల్టేషన్ ఫీజుతో ఆసుపత్రులు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆరోగ్యశిబిరాలు, రెండు పాఠశాలల్లో భవనాల నిర్మాణం, ఐదు పాఠశాలల్లో కెమికల్ ల్యాబ్‌ల ఏర్పాటు, ఆరు కమ్యూనిటీ భవనాల నిర్మానం, మహిళల స్వయంఉపాధికి మగ్గం వర్క్, మెహందీ జ్యూట్ బ్యాగ్స్ తయారీలో శిక్షణ, టిటిసి అభ్యర్థులకు శిక్షణ వంటి ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఆరిలోవ, శ్రీహరిపురంలోని ప్రభుత్వ ఆసుపత్రులను కంపెనీ ద్వారా నిర్వహించే యోచనలో ఉన్నామన్నారు. కార్యక్రమంలో చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ నారాయణ పాత్రుడు, సీనియర్ మేనేజర్ (హెచ్ఆర్) శ్రీకాంత్, డిప్యూటీ మేనేజర్ సిఎస్ఆర్ వెంకటరమణ, వేణుగోపాల్ రెడ్డి, అప్పలరెడ్డి పాల్గొన్నారు.

ఆదివాసీలకు మేలు చేసేలా పర్యటకాభివృద్ధి ఉండాలి

ప్రజాశక్తి- మాధవధార : ఆదివాసీలకు ఉపాధి కల్పించే టూరిజాన్ని అభివృద్ధి చేయాలని ఎపిసిసి ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు.ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ పర్యాటక రంగం అభివృద్ధి పేరుతో 1/70 చట్టానికి సవరణలు చేస్తే గిరిజనుల మనుగడకు ముప్పు ఏర్పడుతుందని ఆవేదన వెలిబుచ్చారు. శాసనసభ స్పీకర్ ఇలా మాట్లాడటం సమంజసం కాదన్నారు. దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడానికి అరుకు చలి ఉత్సవాలు నిర్వహిస్తుందని, వీటివల్ల ఆదివాసీలకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు.

పర్యాటకశాఖకు వచ్చే ఆదాయంలో 25 శాతం నిధులు స్థానిక ఆదివాసీల అభివృద్ధికి ఖర్చు చేయడం, ఏజెన్సీ ప్రాంతంలో రోడ్లు, వంతెనలు నిర్మాణం, విద్య, వైద్యం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలి. డోలీ మోతల కష్టాల నుంచి విముక్తి కల్పించి, రక్తహీనత, సికిల్‌సెల్ ఎనీమియా, టైఫాయిడ్, మలేరియా, వంటి వ్యాధులకు సరైన వైద్యసేవలు కల్పించాలన్నారు. ఆదివాసీల కళలు, సంస్కృతిని కాపాడుతూ ఉత్సవాల నిర్వహణ పట్ల ప్రభుత్వం పూర్తి దృష్టి సారించాలన్నారు. టూరిజం అభివృద్ధికి పెట్టుబడుదారులను ప్రోత్సహించడం కంటే గిరిజన భాగస్వామ్యంతో ప్రభుత్వమే నేరుగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంపై సిఎం, డిప్యూటీ సిఎం, స్పీకర్‌తోపాటు పర్యాటకశాఖ మంత్రి దృష్టి పెట్టాలని వెంకటరావు కోరారు.

హైస్కూల్ శత వసంతాల వేడుక ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-భీమునిపట్నం :ఫిబ్రవరి 1,2 తేదీల్లో నిర్వహించతలపెట్టిన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల శత వసంతాల వేడుకల ఏర్పాట్లును డిఇఒ. ప్రేమ్‌కుమార్ పరిశీలించారు. అందరినీ సమన్వయపరుస్తూ వేడుకలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని నిర్వహణ కమిటీ ప్రతినిధులను కోరారు. వేడుకల నిర్వహణపై డిఇఒ. పలు సూచనలు చేశారు. ఏర్పాట్లు పరిశీలించిన వారిలో డిప్యూటీ డిఇఒ. సోమేశ్వర రావు, ఎంఇఒలు, వివిధ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, నిర్వహణ కమిటీ ప్రతినిధులు ఉన్నారు.

నిర్వాహక కమిటీ ప్రతినిధులకు సూచనలు చేస్తున్న డిఇఒ

నేడు మాంసాహార దుకాణాలకు సెలవు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : మహాత్మాగాంధీ వర్థంతి సందర్భంగా జిల్లా కలెక్టర్, జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు ఈనెల 30న గురువారం జివిఎంసి పరిధిలో జంతువధ, మాంసం విక్రయాలపై నిషేధం ఉన్నందున జంతువధశాలలు, మటన్, చికెన్, చేపలు, మొదలైన మాంసాహారపు దుకాణాలకు సెలవు ప్రకటించినట్లు జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్‌వి.నరేష్ కుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. హోటళ్ళు, రెస్టారెంట్లలో ఎటువంటి మాంసాహారాలను వినియోగించరాదని సూచించారు. శానిటరీ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులు, మేస్త్రీలు తమ సచివాలయాల పరిధిలో మాంసం, చేపలు విక్రయశాలలను మూసేయించాలని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమించి మాంసాహార విక్రయాలు చేపడితే చట్టపరమైన చర్యలతో పాటు జరిమానా విధించక తప్పదని హెచ్చరించారు.

నియోజకవర్గ సమస్యలపై వినతి

చంద్రబాబుతో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి- సీతమ్మధార : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును విశాఖ దక్షిణ జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దక్షిణ నియోజకవర్గంలోని సమస్యలను సిఎం చంద్రబాబుకు వివరించి, వాటి పరిష్కారంతోపాటు అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. ముఖ్యంగా దేవాదాయ భూసమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ చంద్రబాబుకు వినతిపత్రం అందజేసినట్లు శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించి త్వరలో పరిష్కరిస్తారని హామీ ఇచ్చినట్లు వంశీకృష్ణ యాదవ్ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి వినతి

ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న లోడగలవానిపాలెం వాసులు

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని లోడగలవానిపాలెం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎంపిడిఒ డాక్టర్ జానకికి జనసేన నాయకులు వినతి పత్రం అందజేశారు. పంచాయతీ పరిధిలో పూర్తిస్థాయి అభివృద్ధి, మౌలికసౌకర్యాలు లేవన్నారు. గత ప్రభుత్వంలో నిర్మించిన రైతు భరోసాకేంద్రం నిరుపయోగంగా ఉందని, హెల్త్‌క్లినిక్ సెంటర్, జలజీవన్ మిషన్ నిధులతో చేపట్టిన మంచినీటి ట్యాంకు నిర్మాణం వంటి పలు పనులు అసంపూర్తిగా ఉండిపోయాయని, వాటిని పూర్తిచేయాలని కోరారు. నేలతేరు గ్రామంలో సిసి రోడ్డు, డ్రైనేజీలు వెంటనే పూర్తి చేయాలని, ఎస్‌సి కాలనీలో పెండింగ్ పనులు పూర్తిచేసి, ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు ఇవ్వాలని, పాఠశాలలో నిలిచిన పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కొయ్య నాని, లోడగల సురేష్, అల్లిరాజు, గోల గాని సాయి, వెంకటేష్, తోటరాజు, బాల పాల్గొన్నారు.

నైపుణ్యతతోనే ఉద్యోగావకాశాలు

- గీతంలో కార్పొరేట్ కంపెనీల చీఫ్ హెచ్‌ఆర్‌ల సదస్సు

గీతం సదస్సులో పాల్గొన్న కార్పొరేట్ కంపెనీల చీఫ్ హెచ్‌ఆర్‌లు

ప్రజాశక్తి -మధురవాడ : ప్రపంచ వ్యాప్తంగా కార్పొరేట్ రంగంలో వస్తున్న మార్పులను అనుగుణంగా నైపుణ్యాలను పెంచుకుంటే యువతకు ఉద్యోగావకాశాలు వరిస్తాయనిజిఎమ్ఆర్ ఇన్‌ఫ్రా లిమిటెడ్, ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం డైరెక్టర్ డాక్టర్ ఇ.శంకరరావు అన్నారు. బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సంస్థల చీఫ్ హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్స్‌తో నిర్వహించిన ప్రత్యేక సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో లక్షల సంఖ్యలో ఉద్యోగాలు కోల్పోతున్నప్పటికీ, అదే సంఖ్యలో కొత్త తరం ఉద్యోగాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. యువతరం డిజిటల్ అక్షరాస్యత, నిరంతర విజ్ఞాన సముపార్జన, లోతైన విషయ పరిజ్ఞానం, విశ్లేషణాత్మక దృష్టిని పెంచుకోవాలని సూచించారు. గీతం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా గీతంలో మానవ వనరుల శిక్షణ అందిస్తున్నామన్నారు. గీతం చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ ఎన్.క్రిష్ మాట్లాడుతూ ఆత్మ విశ్వాసం, నిజాయితీ, ఎవరితోనైనా పోటీపడే సమర్థత అలవరుచుకోవాలన్నారు. గీతంలో విద్యార్థులను మెంటార్‌లుగా వ్యవహరించే నూతన పద్ధతిని ప్రారంభించామని, తగు శిక్షణ ద్వారా జూనియర్లకు 14 వందల మంది సీనియర్ విద్యార్థులు మెంటార్‌లుగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రాంగణ నియామకాలు పెరగడానికి ఇది దోహదపడుతుందన్నారు. ఎడూన్ సంస్థ వ్యవస్థాపకుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ డిజిటల్ యుగంలో ఉద్యోగ నైపుణ్యాలతో పాటు బతకడానికి అవసరమైన నైపుణ్యాలపైనా యువత దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజాపణిపప్పు, జెమ్ కన్వీనర్ డాక్టర్ బి.కృష్ణకుమారి, జెమ్ 25 చీఫ్ ఎక్సిక్యూటివ్ ఆఫీసర్ ఎస్ఎస్.మిత్రా, జెమ్‌కో సిఇఒ కె.చెర్రి హేడ్స్, గీతం బిజినెస్ స్కూల్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ కె.లుబ్జ నిహార్, సదస్సు కన్వీనర్ డాక్టర్ టి.సౌదామినిపాల్గొన్నారు.

షిప్‌యార్డు విశ్రాంత ఉద్యోగులకు మొండిచేయి

చర్చల్లో కానరాని సానుకూలత :2శాతం పిఎఫ్ కేసు ఉపసంహరణకు ససేమిరా

పెన్షనర్లతో మాట్లాడుతున్న యూనియన్ ప్రతినిధులు

ప్రజాశక్తి -ములగాడ : విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై చర్చలకు ఆహ్వానించిన షిప్‌యార్డు యాజమాన్యం మొండిచేయి చూపిందని పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం యాజమాన్యం పిలుపుమేరకు ఎపిఆర్‌పిఎ సంఘం తరుపున జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.హుస్సేన్, కె.కుమార్‌మంగళం, జిఎస్ ఆనంద్‌కుమార్, బి. సత్యానందం, ఎం.వి.రమణమూర్తి ఐదుగురు ప్రతినిధులు చర్చలకు హాజరయ్యారు. చర్చల అనంతరం షిప్‌యార్డు మెయిన్ గేటు వద్ద వేచియున్న పెన్షనర్లతో యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ, విశ్రాంత ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ట్రిబ్యునల్‌లో ఉన్న కేసును ఉపసంహరించుకొని రెండుశాతం పిఎఫ్ బకాయిలు చెల్లించాలని, రిటైరైన వెంటనే లీవ్ పేమెంట్ చేయాలని, మెడికల్ సౌకర్యం కల్పించాలని యాజమాన్యాన్ని కోరామన్నారు. రెండుశాతం పిఎఫ్‌ఐ కోర్టు కేసు వెనక్కుతీసుకునేది లేదని యాజమాన్యం ఖరాఖండిగా చెప్పిందని వివరించారు. వైద్య సదుపాయం విషయంలో ఆలోచిస్తామని, లీవ్ పేమెంట్ ఆరు నెలల లోపు చెల్లించేందుకు అంగీకరించారన్నారు. పెన్షనర్ల సమస్యలపై యాజమాన్యం మొండివైఖరితో ఉన్న నేపథ్యంలో భవిష్యత్తు కార్యాచరణపై చర్చించి వెల్లడిస్తామని ప్రకటించారు. 10న జరిగిన ధర్నాను మించిపోయేలా ఆందోళనలను చేపడితేగానీ యాజమాన్యం దిగొచ్చే పరిస్థితి లేదని దీనికి సన్నద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై పరిశీలన

వైద్యులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి- సీతమ్మధార : సమయపాలన పాటిస్తూ, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. బుధవారం అక్కిరెడ్డిపాలెం, ములగాడ యుపిహెచ్‌సిలతోపాటు నాతయ్యపాలెం, అక్కిరెడ్డిపాలెం సచివాలయాలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. అక్కడ సిబ్బందితో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. ఇందులో భాగంగా ఎంఆర్ 1,2 బ్యాక్‌లాగ్స్, ఇన్, అవుట్‌పేషెంట్ సేవలు, ఇహెచ్‌ఆర్ డయాగ్నొస్టిక్ సేవలు, మందుల లభ్యత, ఎన్‌సిడి3.0 సర్వే, ఆర్‌బిఎస్‌కె, ఆర్‌కెఎస్‌కెలపై ఆరా తీశారు. సమగ్ర వైద్యసేవలు, రిఫరల్స్‌పై సంబంధిత వైద్యులు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఫేషియల్ హాజరు, సమయపాలన, శతశాతం ఆభ ఐడి మ్యాపింగ్‌పై సూచనలు చేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఆరోవార్డులో పలు అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాలతో రూ.3.90 లక్షలతో పనులకు శ్రీకారం చుట్టినట్లు వార్డు టిడిపి అధ్యక్షులు దాసరి శ్రీను తెలిపారు. వార్డు పరిధిలోని తులసినగర్ వాకర్స్ పార్కు నుంచి పైకి రోడ్డు, పీఎం పాలెం ఆర్ఆర్ కల్యాణ మండపం నుంచి మాలతాంబ స్కూల్ వరకు సిసి రోడ్డు, గాయత్రి నగర్‌లో పార్క్ అభివృద్ధి,హిందూ, ముస్లిం, క్రిస్టియన్, శ్మశానవాటికల పహరీ నిర్మాణం, హెచ్‌పిసిఎల్ లేఅవుట్‌లో రోడ్ నెంబర్ 6 వద్దకు రోడ్డు నిర్మాణం, లలిత దేవి గుడి వద్ద మరో రోడ్డు, బక్కన పాలెం పరిసర ప్రాంతాల్లో ఆరు లైన్ల రోడ్డు, డ్రైనేజీ నులను డ్రైన్స్ పనులు తొందరలోనే చేపట్టనున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

తప్పెటగుళ్ళు కళాకారులతో ఆలయ ధర్మకర్త, కమిటీ

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని లోడగలవానిపాలెం పంచాయతీ లో అభయ ఆంజనేయస్వామి 18వ వార్షికోత్సవాలు ఆలయధర్మకర్త బమ్మిడి సూర్యనారాయణ,ఉమా దంపతులు ఆధ్వర్యంలో బుధవారంఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేలబోయిన సత్యం బొబ్బిలి కళాకారుల బృందం తప్పెటగుళ్ళు, హరే రామ హరే కృష్ణ భజన, ఇతర కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించగా, అధిక సంఖ్యలోభక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం 4వేలమందికి అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు డాక్టర్ సందీప్ పంచకర్ల, తర్లువాడ సర్పంచ్ బిఆర్‌బి నాయుడు, తాట్రాజు అప్పారావు, తమ్మిన అప్పలరాజు బమ్మడి తారక్, టిడిపి, జనసేన నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల రక్తదానం

రక్తదానం చేసిన 75 మంది వైద్య విద్యార్థులు వీరే

ప్రజాశక్తి- తగరపువలస : దేశం గణతంత్ర భారతిగా ఆవిర్భవించి 75ఏళ్ల పూర్తయిన సందర్భంగా స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ ఆసుపత్రిలో బుధవారం 75 మంది వైద్య విద్యార్థుల రక్తదానం చేశారు. వీరిలో 50 మంది తొలిసారిగా రక్త దానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వైద్య విద్యార్థులు రక్తదానం చేయడాన్ని పలువురు అభినందించారు. ఎన్ఆర్ఐ వైద్య విద్యాసంస్థ విద్యార్థుల అంకితభావాన్ని కళాశాల డీన్ డాక్టర్ పివి సుధాకర్ కొనియాడారు. కార్యక్రమంలో బ్లడ్ సెంటర్ ఇన్‌ఛార్జి డాక్టర్ ఎంఎస్ శర్మ, ప్రొఫెసర్ డాక్టర్ జివి శివప్రసాద్, సామాజిక శాస్త్ర విభాగపు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి శ్రీనివాస్, సూక్ష్మ జీవశాస్త్ర విభాగపు ప్రొఫెసర్ డాక్టర్ కెవి చక్రధర్, అనిల్ నీరుకొండ ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ కెసి రెడ్డి పాల్గొన్నారు

ముమ్మర సాధనలో అంధ క్రికెటర్లు

2 నుంచి 7 వరకు బెంగళూరులో జాతీయస్థాయి టోర్నీ

ఆంధ్రా జట్టుకు ఎంపికైన అంధ క్రికెటర్లు

ప్రజాశక్తి -మధురవాడ : బెంగుళూరులో ఫిబ్రవరి 2 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ స్థాయి అంధుల క్రికెట్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రా జట్టు క్రీడాకారులు బుధవారం ముమ్మరంగా సాధన చేశారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, కార్యదర్శి సానా సతీష్‌బాబు, ఇతర అపెక్స్ కౌన్సిల్ సభ్యుల సహకారంతో బుధవారం నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం గుల్లేపల్లి మైదానంలో ప్రాక్టీసు నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ కమిటీ కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ, సభ్యులు సురవరపు రామన్ సుబ్బారావు, ఇల్లూరి అజయ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

విద్యుత్ రంగాన్ని కాపాడుకోవాలి

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యం

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యుత్ రంగాన్ని ప్రభుత్వాలు కుదేలు చేస్తున్నాయని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు వేపాడ సత్యం పేర్కొన్నారు. అనకాపల్లి సిఐటియు ఆఫీసులో యూనియన్ రీజినల్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. రీజనల్ అధ్యక్షులు ప్రేమ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సత్యం మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను తెలంగాణ విద్యుత్ సంస్థలో విలీనం చేసిందని, ఆంధ్ర రాష్ట్రంలో కాంట్రాక్ట్ వర్కర్లని పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకర్రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సంస్కరణల వలన విద్యుత్ సంస్థలు నష్టాల్లో కూరుకుపోతున్నాయని తెలిపారు. అదానికి విద్యుత్తును కట్టబెట్టడానికే సౌర విద్యుత్తు, పవన విద్యుత్ కొనుగోలు చేస్తున్నాయన్నారు. చండీఘర్‌లో విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దీర్ఘకాలంగా పోరాడుతున్నారని, మన రాష్ట్రంలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం సంఘం నాయకులు జమీలు, శ్రీను, నాగఅప్పారావు, కె.రవికుమార్, దార అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేపాడ సత్యం

రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

ఫార్మర్ రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు

ప్రతి రైతు ఫార్మర్ రిజిస్టర్‌లో వారి వ్యక్తిగత వివరాలు, వ్యవసాయ భూమి వివరాలు తప్పని సరిగా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయధికారి బి.మోహన్‌రావు అన్నారు. బుధవారం దాలివలసలో జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఫార్మర్ రిజిస్ట్రీ గురించి రైతులకు వివరించారు. ఈ రిజిస్ట్రీ వ్యవసాయ, రెవిన్యూ శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తాయని, రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుకు 14 నెంబర్లు గల ఒక గుర్తింపు కార్డు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ప్రతి రైతు రైతు సేవ కేంద్రంలో ఉన్న వ్యవసాయ, ఉద్యాన అధికారులను సంప్రదించాలని సూచించారు. ఎన్‌పిఎస్ఎస్ యాప్‌ను రైతులు వినియోగించుకోవాలన్నారు. అనంతరం కాయకూరలు పండిస్తున్న రైతుల పొలాలకు వెళ్లి ఎన్‌పిఎస్ఎస్ యాప్‌ను వాడుకునే విధానాన్ని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూమిరెడ్డి దేముళ్ళు, రెడ్డి రామస్వామి, భూమిరెడ్డి సన్నిబాబు, మండల వ్యవసాయఅధికారి సోమశేఖర్, ఎఇఓలు లైలా, ప్రియాంక, వ్యవసాయ సిబ్బంది సుదీర్ దొర, శిల్ప, సౌజన్య, అనూష రైతులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని చింతలపూడి, నాగయ్యపేట గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి ఎల్‌వై కాంతమ్మ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కొండెంపూడి కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చంద్ర శేఖర్, ఉమా మహేశ్వరరావుతో కలిసి మొక్కజొన్న, మినుము, వేరుశనగ పంటలను పరిశీలించారు. మొక్కజొన్నలో కాండం తొలిచే పురుగు గమనించి వాటి నివారణకు క్వినాల్ఫాస్ మందును ఒక లీటరు నీటికి రెండు మిల్లీ లీటర్ల నీటిని కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఇంకా నువ్వు, మినుము పంటలను పరిశీలించి వాటికి పట్టిన చీడల నివారణకు చేపట్టాల్సిన చర్యలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్ కిరణ్ కుమార్, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీపై శాసనసభా కమిటీ నివేదిక బయటపెట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి-దేవరాపల్లి : విశాఖ పాల డెయిరీ అవినీతి, అక్రమాలపై శాసనసభా కమిటీ దర్యాప్తు నివేదికను వెంటనే బయటపెట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సహకార సంఘంగా ఉన్న విశాఖ డెయిరీని తమ స్వార్థ ప్రయోజనాల కోసం అడారి తులసీరావు కుటుంబం మొదట మ్యాక్స్ చట్టం కిందకు, తరువాత కంపెనీ చట్టం కిందుకు మార్చిందని తెలిపారు. కంపెనీ చట్టంగా మారడంతో ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో అన్ని అవినీతి అక్రమాలకు అవకాశం కలిగించదన్నారు. డెయిరీ చైర్మన్ డెయిరీ ఆస్తిని కుటుంబ ప్రయివేటు ఆస్తిగా మార్చుకొని అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. 2024 సెప్టెంబర్‌లో ఆవుపాల సేకరణ ధర తగ్గించిన నేపథ్యంలో రైతుల ఆందోళనతో దిగొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం విశాఖ డెయిరీ అక్రమాలపై శాసనసభా కమిటీని నియమించిందని గుర్తు చేశారు. తరువాత విశాఖ డెయిరీ చైర్మన్ అడారి ఆనంద కూమార్ బిజెపి చేరడంతో శాసన సభా కమిటీ నివేదిక బుట్టదాఖలైందని విమర్శించారు. దీంతో తగ్గించిన పాల సేకరణ ధర పెంచకపోగా, రైతుల నుండి ఆవు పాలు సేకరణ తగ్గిస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకొని విశాఖ డెయిరీ యాజమాన్యం అక్రమాలపై శాశనసభా కమిటీ నివేదికను బయటపెట్టి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ డెయిరీని సహకార చట్టం పరిధిలోకి తీసుకురావాలని, పాల సేకరణ ధర పెంచాలని కోరారు.

యలమంచిలిలో సినిమా షూటింగ్ సందడి

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి బస్టాండ్, రైల్వే స్టేషన్‌రోడ్డులో బుధవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. ఉదయం పది గంటలకు హైస్కూలు, కాలేజీలకు వెళ్లే సమయంలో సినిమా షూటింగ్ జరుగుతుండడంతో యువతీ యువకులంతా గుమి కూడారు. షూటింగ్ ఏర్పాట్లు చేసుకున్న సినిమా యూనిట్‌కు విద్యార్థుల తాకిడి ఎక్కువ కావడంతో నానా హరానా పడ్డారు. ఒక విద్యార్థిని రోడ్డుపై పరిగెడుతుంటే రౌడీ యువకుల మూక ఆమె వెండపడి వేధించడం షూటింగ్ అంశం. ఐదారు షాట్లు తీసినప్పటికీ సంతృప్తి వ్యక్తం కావడంతో విద్యార్థులంతా వెళ్లి పోయే వరకు షూటింగ్ నిలిపివేశారు. అనంతరం షూటింగ్ స్పాట్ కాలేజీ రోడ్డుకు మారింది. పరిగెడుతున్న విద్యార్థిని వెంటబడుతున్న రౌడీల మూకకు దన్నుగా జీపుపై విలన్ వెంబడించడం షూటింగ్ కొనసాగింపుగా జరిగింది.

ఎన్టీఆర్ కాలనీలో రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి- అనకాపల్లి : జీవీఎంసీ 80వ వార్డు పాత 23వ వార్డు ఎన్టీఆర్ కాలనీలో బొడ్డేడ జోగినాయుడు పర్యవేక్షణలో రోడ్డు వేయడం జరుగుతుందని శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ బొడ్డేడ మురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో 23వ వార్డు కార్యదర్శి బుద్ధ ఈశ్వరరావు జనసేన పార్టీ నాయకులు సూరిశెట్టి రాముడు, సిహెచ్.నూకరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికునికి రవికుమార్ పరామర్శ

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని మల్లునాయుడుపాలెం గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు దొమ్మిసి రాముకు రెండు వారాల క్రితం గుండెపోటు రావడంతో కెజిహెచ్‌లో చికిత్స పొంది ఇంటికి వచ్చిన నేపథ్యంలో ఆయన్ను వైసిపి పెందుర్తి నియోజకవర్గ నేత గండి రవి కుమార్ బుధవారం పరామర్శించారు. రాముకు రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు ఐడి బాబు, ఎడ్ల నాయడు, శిరపరపు శ్రీను, సిరపరపు వాసు, కరక రాము, గురి శ్రీను, గోతిరెడ్డి అమ్మతల్లి, బత్తిన వెంకట రమణ పాల్గొన్నారు.

బ్రాండిక్స్‌లో పని గంటలు పెంపు సరికాదు

మాట్లాడుతున్న సిఐటియు నేత రాము

ప్రజాశక్తి-అచ్యుతాపురం

బ్రాండిక్స్ కంపెనీలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి పని సమయాన్ని అరగంట అదనంగా పెంచడంపై సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం నిరసన ప్రదర్శన చేశారు. బ్రాండిక్స్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులను అదనంగా అరగంట సమయం పనిచేయాలని యాజమాన్యం ఒత్తిడి చేయడాన్ని సిఐటియు తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, మండల కార్యదర్శి కె సోము నాయుడు మాట్లాడుతూ బ్రాండ్ ఎక్స్‌లో ఉన్న పరిశ్రమలలో చట్ట ప్రకారం 8 గంటల పని చేయాల్సి ఉండగా, అదనంగా పని భారం పెంచడం సరైన విధానం కాదని పేర్కొన్నారు. మహిళా కార్మికులు ఆరోగ్యాలను ఫణంగా పెట్టి పరిశ్రమ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్నారని చెప్పారు. ఏ షిఫ్ట్ విధులకు వెళ్ళడానికి తెల్లవారుజామున రెండు గంటలకు లేచి తయారై, మూడు గంటలకు బస్సు పాయింట్‌కు రావాల్సి వస్తోందని తెలిపారు. డ్యూటీ ముగించుకొని తిరిగి ఇంటికి వచ్చేసరికి సాయంత్రం నాలుగు అవుతుందని తెలిపారు. ఏ, బి రెండు షిఫ్ట్‌లు డ్యూటీ చేయాలంటే 15 గంటలు పడుతుందని, దీనివలన కార్మికులకు సరైన విశ్రాంతి లేకపోవడం వల్ల తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పాత పద్ధతిలో ఎనిమిది గంటల పని సమయం కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కష్టానికి తగ్గ వేతనాలు పెంచాలని, మహిళా కార్మికులకు రాత్రి విధుల నుండి మినహాయించాలని కోరారు.

ఫార్మా భూములను స్వాహా చేస్తున్న సిఎం.రమేష్

వైసిపి అనకాపల్లి పార్లమెంటరీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ అనకాపల్లి ప్రాంతంలో ఉన్న కొండలను పిండి చేసి అక్రమంగా తరలించుకుపోతున్నారని, ఫార్మా కంపెనీలకు చెందిన గ్రీనరీ భూములను బినామీ పేర్లతో స్వాహ చేస్తున్నారని వైసిపి అనకాపల్లి పార్లమెంటరీ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ ఆరోపించారు. స్థానిక రింగ్ రోడ్‌లో వైసీపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏర్పడి ఎనిమిది నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. జిల్లాలో వైసిపి శ్రేణుల్లో ఉత్తేజం నింపి, పునరంకితమై ఉత్సాహంగా పనిచేయవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలో బొత్స సత్యనారాయణ, బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్నాథ్ తదితర నాయకులందరితో చర్చించిన మేరకు తనకు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈ బరువైన బాధ్యతను విశ్వాసంతో అప్పగించారని తెలిపారు. రానున్న కాలంలో సూపర్ సిక్స్ అమలపై ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీస్తామన్నారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, బొడ్డేడ ప్రసాద్, మలసాల రమణ రావు, మందపాటి జానకి రామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పెద్దిశెట్టి గోవింద, కసింకోట జడ్పిటిసి దంతులూరు శ్రీధర్ రాజు, జాజుల రమేష్, మలసాల కుమార్ రాజా, కలగా గున్నయ్య నాయుడు, కోరుకొండ రాఘవ, ఉగ్గిన అప్పారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నేత కరణం ధర్మశ్రీ

కుష్టు వ్యాధిపై కేంద్ర బృందం పరిశీలన

ప్రజాశక్తి-కశింకోట

ఎల్‌సిడిసి సర్వే తనిఖీలో భాగంగా బుధవారం కేంద్ర లెప్రసీ టీమ్ కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించింది. అనంతరం బృందం సభ్యులు కశింకోట దాడి వీధిలో ప్రజలను సర్వే గురించి అడిగి తెలుసుకున్నారు. శరీరం భాగంలో అనుమానత మచ్చలు ఉంటే సమీపంలో ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయంచుకోవాలని సూచించారు. ముందుగా ఆసుపత్రిలో రికార్డులు పరశీలించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృందం డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమరన్, సభ్యులు డాక్టర్ భాగ్యజ్యోతి, రాష్ట్ర లెప్రసీ జాయంట్ డైరక్టర్ డాక్టర్ దేవ సాగర్, జిల్లా లెప్రసీ అధికారి డాక్టర ఎంఎస్‌వికే.బాలాజీ, కశింకోట వైద్యాధికారులు డాక్టర్ తిరుపతి రావు, యశోద, హెచ్ఇఓ సత్యనారాయణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని రావాడ పంచాయతీ పరిధి గొల్లగుంట గ్రామంలో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను బుధవారం స్థానిక సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, పంచాయతీ కార్యదర్శి అనురాధ పర్యవేక్షించారు. పంచాయతీ సాధరణ నిధులు సుమారు 8లక్షలతో ఈ పనులు ప్రారంభించినట్లు సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు తెలిపారు. కొత్తగా నిర్మిస్తున్న డ్రైనేజీల ద్వారా మురుకు నీరు చివర వరకు పోయేవిధంగా వాటర్ లెవిలింగ్, పనుల నాణ్యత సరిచూసుకోవాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్ శిరిషాకు సర్పంచ్ సూచించారు. రానున్న రంజాన్ మాసంలో మహిళలకు నమాజ్ చేయుటకు వీలుగా కమ్యూనిటీ భవనాన్ని మరమ్మతు చేయించాలని సర్పంచ్‌ను స్థానికులు కోరారు. సర్పంచ్ స్పందిస్తూ కమ్యూనిటీ భవనం మరమ్మతులకు సంబంధించి తీర్మానాలు, అంచనాల వ్యయం తయారు చేశామని తెలిపారు. ఫిబ్రవరి నెల చివరికల్లా మరమ్మతు పనులు పూర్తి చేయించాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్ శిరిషాను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనురాధ, వార్డు సభ్యులు సైరా బేగం, కాంట్రాక్టర్ సోమేష్, పంచాయతీ సిబ్బంది హుస్సేన్, త్రినాధ్, గ్రామస్తులు మదీనా, అభిదాబేగం, అన్సార్, మక్బుద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ సన్యాసినాయుడు

మాట్లాడుతున్న టిడిపి మండల అధ్యక్షులు సూర్యనారాయణ

31న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రంలో ఈనెల 31న జరగనున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ కోరారు. బుధవారం స్థానిక రైవాడ అతిథిగృహం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ జాబ్ మేళాలో 16 కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు చేస్తారన్నారు. ఈసమావేశంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు కొమర బాబురావు, టిడిపి పార్లమెంటు ఉపాధ్యక్షులు చల్లా నానాజీ, మండల ఆర్గనైజింగ్ కార్యదర్శిలు ఈర్లే రామాంజనేయులు, గొర్రెపోటు రమేష్, తెలుగు యువత అధ్యక్షులు వనం వెంకటేష్, గ్రామ శాఖ అధ్యక్షులు రెడ్డి సురేష్, పాశల కృష్ణ పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో జూదాలను అరికట్టాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురంలో జోరుగా సాగుతున్న జూదాలను అరికట్టాలని సిపిఎం మండల కన్వీనర్ ఆర్ రాము బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రామాల్లోనూ, మండల కేంద్రంలోనూ జూదాల జోరు పెరిగిందన్నారు. షూట్ బాల్ లాటరీ అచ్యుతాపురం మండల కేంద్రంలో నిర్వహించడం వలన అమాయక ప్రజలు లక్షలాది రూపాయలు పోగొట్టుకుంటున్నారని పేర్కొన్నారు. ఇటువంటి జూదాలను నివారించాల్సిన అధికారులు ఎటువంటి హెచ్చరికలు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే బహిరంగంగా ఇటువంటి జూదలను అరికట్టాలని కోరారు. ఎక్కడో బహిరంగ సభలు పోరాడే నాయకులను గృహనిర్బంధాలు చేసే పోలీసులు ఇప్పుడు జూదాలపై పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.

డాక్టర్ శ్రీనివాస్‌కు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : రిపబ్లిక్ డే సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావుకు ఉత్తమ పురస్కారం లభించడం పట్ల ప్రజాసంఘాల ఐక్యవేదిక హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు బుధవారం ఆసుపత్రిలో డాక్టర్ శ్రీనివాసరావును సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ పురస్కారంతో తనపై మరింత బాధ్యత జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు విల్లూరి పైడారావు, బొడ్డేడ అప్పారావు, డాక్టర్ చిన్నియాదవ్, బొడ్డు సోమరాజు, వాసుపల్లి తాతయ్యలు, బొబ్బిలి గోవిందరాజులు, ముగడా అప్పారావు, భరిణికాన సూరిబాబు, చదరం వెంకట్రావు, సత్యసాయిబాబా పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక నందీశ్వర కళా ప్రాంగణం ఆవరణలో బొడ్డేడ ప్రసాద్ మిత్రమండలి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను బుధవారం ఎలమంచిలి ఎంపీపీ బోదెపు గోవిందు ప్రారంభించారు. క్రీడాకారుల పరిచయ అనంతరం ఆయన మాట్లాడుతూ వైకాపా రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ప్రతి ఏటా జనవరి నెలలో ప్రసాద్ మిత్రమండలి ఆధ్వర్యంలో గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు చేయడంతో పాటుగా కళాకారులకు, క్రీడాకారులకు పెద్దపీట వేయడం అభినందనీయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు, భీశెట్టి గంగ అప్పలనాయుడు, బొడ్డేడ శ్రీనివాసరావు, ఎంపీటీసీ మద్దాల వీరు నాయుడు, పల్లె నాయుడు, కాండ్రేగుల జగన్, టెక్కలి కొండలరావు, రాజాన బుజ్జిబాబు, మల్ల కష్ణ, ఆడారి కాశి బాబు, పెంటకోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రేపు పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : కొత్తూరు సబ్‌స్టేషన్ పరిధిలో 33 /11కెవి కసింకోట సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు కసింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ రామకష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. దీని వల్ల కొత్తూరు, మూలపేట, సత్యనారాయణపురం, సంపతిపురం, వేట జంగాల పాలెం, కూండ్రం, కుంచంగి, రొంగలి వాని పాలెం, పిసినికాడ గ్రామాలలో ఉదయం 9నుండి మధ్యాహ్నం 1వరకు విద్యుత్ సరాఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహరించాలని కోరారు.

గోవాడ సుగర్స్‌లో వెంటనే క్రషింగ్ చేపట్టాలి

ఎపి చెరుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి అప్పారావు

ప్రజాశక్తి-చోడవరం

గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ తరచూ ఆగిపోవడం వలన చెరుకు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, వెంటనే క్రషింగ్ ప్రారంభించి రైతులు చెరుకు వేగవంతంగా తీసుకోవాలని ఎపి చెరుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. గోవాడ ఫ్యాక్టరీ క్రషింగ్ నిలిచిపోవడంతో బుధవారం ఫ్యాక్టరీని పరిశీలించి యార్డులో రైతులతో మాట్లాడారు. యార్డుకు చెరుకు తోలుకు వచ్చిన రైతుల పశువులకు నీళ్ళ, దానా, మేత వంటి సౌకర్యాలు లేకపోవడం వల్ల రైతులు పలు ఇబ్బందులకు గువుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బెగాస్ నిల్వ ఉంచకపోవడమే ఇప్పుడు ఫ్యాక్టరీ ఆగిపోవడానికి కారణమని రైతులు కార్మికులు చెబుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా గోవాడషుగర్ ఫ్యాక్టరీ మధ్యలో ఆగిపోకుండా ఫ్యాక్టరీ నిత్యం తిరిగేలా ఫ్యాక్టరీ ఎండి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే గోవాడ షుగర్ ఫ్యాక్టరీ అన్ని రకాలుగా ఆదుకొని ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. చెరుకు రైతులు బకాయిలు, కార్మికుల బకాయిలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు, సహాయ కార్యదర్శి ఎస్వీ నాయుడు, పి సాంబశివరావు, రైతులు ఆడారి అప్పలనాయుడు, నర్సింగరావు, రాము, రమణ పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న రైతు సంఘం నేత కర్రి అప్పారావు

భార్యను హతమార్చిన భర్త

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ముషిడిపల్లిలో బొడ్డు నారాయణమూర్తి అనే వ్యక్తి తన భార్య వరలక్ష్మి (38)ని నైలాన్ తాడుతో ఉరి వేసి హత్య చేశాడు. తీవ్ర సంచలనం రేపిన ఈ ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. దేవరాపల్లి ఎస్ఐ టి.మల్లేశ్వర్రావు బుధవారం తెలిపిన వివరాలు ప్రకారం... విజయనగరం జిల్లా కొత్తవలస మండలం దెందేరు సంతపాలెం గ్రామానికి చెందిన వరలక్ష్మిని ముషిడిపల్లికి చెందిన నారాయణమూర్తి 2002లో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇంటర్ చదువుతున్న కుమార్తె, 3వ తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నారు. మద్యానికి బానిసైన నారాయణమూర్తి తరచూ భార్యను వేధిస్తూ చిత్రహింసలకు గురిచేసేవాడు. వీరిద్దరి మధ్య నిత్యం గొడవలు జరుగుతుండేవి. అనేక సార్లు పెద్దల సమక్షంలో నారాయణమూర్తిని మందలించినా అతని ప్రవర్తనలో ఏ మాత్రం మార్పురాలేదు. ఇదే క్రమంలో మంగళవారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మద్యం మత్తులో ఉన్న నారాయణమూర్తి ఇంటిలో మంచంపై నిద్రమత్తులో ఉన్న భార్య మెడకు నైలాన్ తాడుని బిగించి ఉరివేసి చంపేశాడు. బుధవారం ఉదయం తన భార్య ఎంత పిలిచినా నిద్రలో నుంచి లేవట్లేదంటూ మృతురాలి కుటుంబానికి నారాయమూర్తి ఫోను చేసి చెప్పాడు. వెంటనే ముషిడిపల్లి చేరుకున్న ఆమె బంధువులు విగతజీవిగా పడి ఉన్న వరలక్ష్మిని చూసి బోరున విలపించారు. తన చెల్లిని తన బావే ఉరి వేసి చంపేశాడంటూ మృతురాలి అన్నయ్య కె.శ్రీరామ్మూర్తి దేవరాపల్లి పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. అతని ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని కె.కోటపాడు సీఐ పి పైడపునాయుడు, దేవరాపల్లి ఎస్ఐ మల్లేశ్వర్రావు బుధవారం పరిశీలించారు. నిందుతుడ్ని అదుపులోకి తీసుకుని విచారణ చెయ్యగా నేరం అంగీకరించాడని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు. విచారణ అనంతరం నిందితుడ్ని కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ తెలిపారు.

వరలక్ష్మి మృతదేహం

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి-కసింకోట

భర్త, అత్త, మామల వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన కసింకోట మండలం వెదురుపర్తి గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. కశింకోట ఎస్సై లక్ష్మణరావు తెలిపిన వివరాలు ప్రకారం... పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు మండలం, కాపవరం గ్రామానికి చెందిన మిరియాల సుమ (29)కు, కసింకోట మండలం వెదురుపర్తి గ్రామానికి చెందిన పలివేల కృపా సాగర్‌తో 2019 సంవత్సరంలో వివాహమైంది. వీరికి నాలుగేళ్ళ, రెండేళ్ళ ఉన్న ఇద్దరు కుమార్తెలున్నారు. కొంతకాలం పాటు వీరి కాపురం సజావుగా సాగింది. కొన్నాళ్లుగా అదనపు కట్నం తేవాలని భర్త, అత్త, మామ, ఆడపడుచు కలిసి సుమను వేధింపులకు గురి చేస్తున్నారు. అవమానిస్తూ సూటిపోటి మాటలు అంటున్నారు. ఇటీవల సుమ పశ్చిమగోదావరి జిల్లాలోని తన పుట్టింటికి వెళ్లి వారం రోజుల కిందట వెదురుపర్తిలోని భర్త ఇంటికి వచ్చింది. ఈ నేపథ్యంలో భర్త, అత్తింటి వేధింపులు ఎక్కువ కావడంతో తీవ్ర మనస్థాపానికి గురైన సుమ మంగళవారం రాత్రి ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు చీర కట్టి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు సుమను బయటికి తీసేసరికే తుది శ్వాస విడిచింది. దీనిపై మృతురాలి తల్లి వెంకయమ్మ పోలీసులు ఫిర్యాదు చేశారు. భర్త, అత్తింటి ఆరాళ్లకు తమ కూతురు బలైందని వెంకయమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. సంఘటనా స్థలానికి ఎస్ఐ లక్ష్మణరావు చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ అల్లు స్వామి నాయుడు చెప్పారు. సంఘటనా స్థలాన్ని బుధవారం అనకాపల్లి డిఎస్‌పి శ్రావణి పరిశీలించారు జరిగిన విషయం పై మృతురాలి కుటుంబ సభ్యులను, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు.

సుమ (ఫైల్‌ఫొటో)

విచారిస్తున్న డిఎస్‌పి శ్రావణి

తీర్థ మహోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండల కేంద్రం అచ్యుతాపురం మోసయ్యపేట జంక్షన్లో ఫిబ్రవరి 4న జరగబోయే అభయాంజనేయ తీర్థ మహెూత్సవానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను రాష్ట్ర రహదారులు అభివద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు బుధవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

సంతలో ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేటలో ప్రతి బుధవారం జరుగు వారపు సంతలో వాహనాలు రోడ్డుపై నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. స్థానిక చెరుకు కాటు వద్ద చాలాకాలంగా వారపు సంతా జరుగుతుంది. ఈ సంతలో సమీప గ్రామాలకు చెందిన రైతులకు పండించిన వివిధ రకాల కూరగాయలు ఆకుకూరలతోపాటు కొన్ని రకాల తినుబండారాలు, చికెన్, చేపలు, బట్టల విక్రయం జరుగుతాయి. సమీప గ్రామాలకు చెందిన ప్రజలు తమకు కావలసిన సరుకుల కోసం వస్తూ ఉంటారు. రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఉండడం, కొనుగోలుదారుల అధికంగా ఉండడంతో వాహనాలు నిలిచిపోతున్నాయి. ఒక్కొక్కసారి అరగంట నుంచి ముప్పావు గంట వరకు వాహనాలు ఆగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల రద్దీ నియంత్రించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో బుధవారం పారిశుధ్య పనులు గ్రామ సర్పంచ్ ఎస్ భాగ్యలక్ష్మి బాబు నాయుడు ఆధ్వర్యంలో చేశారు. మురుగు కాలువలలో పేరుకుపోయిన చెత్తాచెదారం వ్యర్థ పదార్థాలను తీయించి దూర ప్రాంతానికి తరలించారు. అలాగే మండల కేంద్రంలో అచ్యుతాపురం మోసాయిపేట పంచాయతీలలో పంచాయతీరాజ్ విస్తరణ అధికారి శ్రీరాముల నాయుడు పర్యవేక్షణలో పారిశుద్ధ పనులు చురుకుగా సాగుతున్నాయి. రహదారులపై చెత్తాచెదారం పరిశుభ్రపరచడం, డస్ట్ బిన్ లో ఉన్న చెత్తను ట్రాక్టర్ల పై వేసి దూర ప్రాంతానికి తరలించడం వంటి పనులను ఆయన సిబ్బందితో చేయిస్తున్నారు.

రేపు సెయింట్ మేరీ హైస్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలిలో ప్రసిద్ధిగాంచిన సెయింట్ మేరీ ఇంగ్లీషు మీడియం హైస్కూలు వార్షికోత్సం 31తేదీన శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు జరుగుతుందని పాఠశాల యాజమాన్యం తెలిపింది. ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే సందరపు విజయకుమార్, అతిథులుగా డిఈఓ గిడ్డి అప్పారావునాయుడు, డివైఈఓ పి.అప్పారావు, తహశీల్దార్ కె.వరహాలు, ఎంఈఓలు మీనాక్షి, అరుణ్‌కుమార్, పోలీస్ ఇనస్పెక్టర్ ఎస్.ధనుంజయరావు పాల్గొంటారని పేర్కొన్నారు.

టెన్త్ విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ఏ.కొత్తపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 144 మంది విద్యార్థులకు అనకాపల్లి జిల్లా సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో బుధవారం పరీక్ష మెటీరియల్ అందించారు. గ్రామంలో 45 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పాపయ్య రాజుపాలెంకు చెందిన పేరూరి దివ్య ఆర్థిక సాయంతో ఒక నిరుపేద మహిళకు కుట్టుమిషన్ అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు కశిరెడ్డి అప్పలనాయుడు, సభ్యులు గోపి, గోవిందు, పెంటారావు, రవిశంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.స్వర్ణలత, పెద్దాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు అన్నదానం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండల వికలాంగుల ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాలలోని వికలాంగులకు బుధవారం ప్రగడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ప్రగడ జగన్నాథరావు, ప్రగడ వీరబాబు, ప్రగడ సంజీవరావు, ప్రగడ దుర్గాప్రసాద్, ప్రగడ పార్వతీదేవి, ప్రగడ రాజు, చిన్న నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

-స్వల్ప వాదోపవాదాలతో మున్సిపల్ బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్ :స్థానిక మున్సిపాలిటీ సమావేశ మందిరంలో విమర్శల మధ్య బడ్జెట్, సాధారణ సమావేశం బుధవారం జరిగింది. చైర్పర్సన్ బోడపాటి సుబ్బులక్ష్మి అధ్యక్షతతన జరిగిన ఈ సమావేశంలో బడ్జెట్ అజెండా చదివి వినిపించడంతో కౌన్సిలర్ కోనేటి రామకృష్ణ, తమరాన నాయుడు విమర్శలు చేశారు. దీనికి కౌన్సిలర్ చింతకాయల రాజేష్ సమాధానం ఇస్తూ కౌన్సిల్ సమావేశానికి రావడానికి ముందు మీకు అందించిన ఎజెండా చదువుకోవాలని అప్పుడు విమర్శలు చేయాలని సూచించారు. నర్సీపట్నం మున్సిపాలిటీ 2025-26 సంవత్సర బడ్జెట్ సమావేశం బుధవారం నిర్వహించారు.. ఈ సమావేశంలో పాల్గొన్న 26వ వార్డు కౌన్సిలర్, చింతకాయల పద్మావతి మాట్లాడుతూ, నాలుగు నెలల కాలంలో వీఎంఆర్డిఏ నుంచి రూ. 4.11 కోట్లు 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.7.50 కోట్ల నిధులు మంజరయ్యాయన్నారు. ఈ నిధుల ద్వారా 43 అభివద్ధి పనులకు టెండర్లు పిలిచినట్టు ఆమె పేర్కొన్నారు. శ్మశానవాటిక రోడ్డు పనులు, కాలువల నిర్మాణానికి రూ. 1.20 కోట్లు కేటాయించారన్నారు. గతంలో ఖర్చు చేయని మిగిలిన నిధులను తిరిగి రప్పించి, పలు అభివృద్ధి పనులకు వినియోగించామని పద్మావతి తెలియజేశారు. కంపోస్ట్ యార్డులో పేరుకుపోయిన చెత్తను తొలగించి వైజాగ్ జిందాల్ ప్లాంట్‌కు తరలించే కార్యక్రమం చేపట్టామన్నారు. అదనంగా, పెద్ద కాంపాక్టర్ కొనుగోలుకు నిర్ణయించినట్టు పేర్కొన్నారు. రెండు ట్రాక్టర్లు కొత్తగా కొనుగోలు చేసి మున్సిపాలిటీలపై అదనపు భారాన్ని తగ్గించినట్లు ఆమె వెల్లడించారు.టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక మొత్తం మున్సిపాలిటీలో దాదాపుగా రెండు వేల వీధి దీపాలను పూర్తిస్థాయిలో అమర్చినట్టు చెప్పారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనుల నాణ్యతపై కౌన్సిలర్లు దృష్టి సారించాలని, నాణ్యతా లోపం ఉన్నట్టయితే వాటిని గుర్తించి, సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకునే విధంగా అధికారులకు సిఫారసు చేయాలని కౌన్సిలర్ సూచించారు. వైసీపీ కౌన్సిలర్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ, మున్సిపాలిటీలోని 20వ వార్డు ఎస్టీ వార్డు కావడంతోనే నిధులు కేటాయించలేదా అని ప్రశ్నించారు. దీనిపై 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేష్ స్పందిస్తూ, "కౌన్సిల్ సమావేశానికి రావడానికి ముందు మీకు అందించిన ఎజెండా చదువుకోవాలని సూచించారు. 20వ వార్డు ఎస్టీ వార్డుకు ఐదు నెలల కాలంలో రూ. 25 లక్షల మున్సిపాలిటీ నిధులు కేటాయించామన్నారు. ఎజెండాలో సీరియల్ నంబర్ 12లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు కేటాయించిన నిధులను పరిశీలించాలన్నారు. దాదాపుగా ఐదు నెలల కాలంలో రూ. 25 లక్షలతో పలు అభివబుద్ధి పనులు చేస్తే.. నిధులు కేటాయించడం లేదని ఎలా చెబుతారని అని ప్రశ్నించారు.

24 వార్డు కౌన్సిలర్ ధనమిరెడ్డి మధు మాట్లాడుతూ నర్సీపట్నం నుండి కష్ణదేవిపేట వెళ్లే ప్రధాన రహదారి శివపురం వద్ద గత వైసిపి ప్రభుత్వంలో కల్వర్టుకు గుంత పడితే, దానికి తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నూతన కల్వర్టు నిర్మాణానికి రూ. 50 లక్షలు కేటాయించడంతో పనులు పూర్తి చేసేందుకు స్పీకర్ చర్యలు తీసుకున్నారన్నారు.వైసీపీ ప్రభుత్వ హాయాంలో 24 వార్డుకు రోడ్లు, డ్రైనేజీలు వంటి అభివద్ధి పనులకు నిధులు కేటాయించలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఐదు నెలల కాలంలోనే సిసి రోడ్లు, డ్రైనేజీలకు రూ. 30 లక్షలు కేటాయించిన స్పీకర్‌కి ధన్యవాదాలు తెలుపుతున్నట్టు స్పష్టం చేశారు.

మాట్లాడుతున్న సభ్యులు

విద్యార్థులకు వడ్డిస్తున్న ఎంపీడీవో

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని బుధవారం ఎంపీడీవో డి సీతారామరాజు, ఎంఈఓ కే నరేష్ సందర్శించారు. మధ్యాహ్నం భోజనం పథకాన్ని పరిశీలించి, రుచి చూసారు. పాఠశాల ప్రాంగణం, వంటగది, డైనింగ్ హాలును పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు శాతశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రత్యేక తరగతులు నిర్వహించి, సబ్జెక్టుల వారిగా బోధన చేయాలని సూచించారు. పాఠశాలలో అవలంబిస్తున్న యాక్షన్ ప్లాన్ గురించి ఉపాధ్యాయులు వివరించారు.

పారిశుద్య పనులు చేపడుతున్న కూలీలు

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్.పురంలో గ్రామ సర్పంచ్ లోచల సుజాత, గ్రామ కార్యదర్శి, ఈవోపీఆర్డీ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పంచాయతీ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ పారిశుధ్య పనులు చేపట్టామన్నారు. ప్రజలందరూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ స్టీల్ బ్యాంక్ ప్రారంభం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:ఎన్టీఆర్ మిని స్టేడియంలో మునిసిపల్ కమిషనర్ జంపా సురేంద్ర వాకర్స్ క్లబ్ స్టీల్ బ్యాంక్‌ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు... వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. వాకర్స్ క్లబ్ సభ్యులు స్టీల్ ప్లేట్స్ వాడాలని నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. గతంలో మునిసిపాలిటీ చేపట్టిన స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సహకారంతో నర్సీపట్నం మునిసిపాలిటీ మెరుగైన ర్యాంకులు సాధించిందన్నారు. స్టీల్ బ్యాంకు ఏర్పాటు చేయడమనేది వినూత్న కార్యక్రమం అని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ కామిరెడ్డి సత్యనారాయణ, ట్రెజరర్ అల్లు అప్పారావు, ఎంవీ రంగారావు, జాయింట్ సెక్రటరీ పిట్ల శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించొద్దు

ప్రజాశక్తి -కోటవురట్ల: రీ సర్వే గ్రామసభలు, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం వ వి ాం చ రా ద ని తహసిల్దార్ తిరుమల బాబు తెలిపారు. బుధవారం రెవెన్యూ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అదేవిధంగా మ్యూటేషన్స్, వివిధ దరఖాస్తులను నిర్దేశించిన సమయంలో పరిష్కరించాలని సూచించారు, అనాధీనం భూముల సమగ్ర వివరాలు క్షేత్రస్థాయి సమాచారాన్ని సేకరించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సిబ్బందిని ఆరా తీస్తున్న తహశీల్దార్

సత్కరిస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఎంపిడిఒకు అభినందనలు

ప్రజాశక్తి-నక్కపల్లి:గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఉత్తమ ఉద్యోగిగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న ఎంపీడీవో డి సీతారామరాజును మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు శాలువాతో సత్కరించి, అభినందనలు తెలియజేశారు.

సత్కరిస్తున్న డిఎస్‌పి

స్పీకర్‌ను కలిసిన డిఎస్‌పి

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడను బుధవారం స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో నర్సీపట్నం సబ్ డివిజన్ డిఎస్పీగా నూతన బాధ్యతలు చేపట్టిన పోతిరెడ్డి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నర్సీపట్నం ప్రాంతంలో గంజాయి పై ఉక్కు పాదం మోపాలని స్పీకర్ సూచించారు. ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారించాలన్నారు.రూరల్ సిఐ రేవతమ్మ, టౌన్ సిఐ గోవింద్ రావు ఉన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలోని కేజేపురం గ్రామంలో దబ్బకుంట రోడ్డు నుంచి కస్పా జగన్నాథపురం బండ్ల వరకు రోడ్డు మమ్మత్తులకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి కృషితో రూ 11 లక్షలు నిధులు మంజూరు చేసారని, దీంతో చురుగ్గా పనులు జరుగుతున్నాయని కెజె పురం ఎంపీటీసీ సభ్యుడు బీశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. గత ప్రభుత్వం ఇటువంటి పనులు చేపట్టక పోవడంతో రహదారి గుండా వెళ్లే వాహన చోదకులు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు.

ఖాతాదార్లకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట: రాజాం కెనరా బ్యాంక్ పరిధిలో 280 డ్వాక్రా గ్రూపులకు అన్నీ విధాలుగా రుణాలు ఇచ్చుటకు సిద్ధంగా ఉన్నామని బ్యాంకు మేనేజర్ మృదుల తెలిపారు. కెనరా బ్యాంక్ ముద్రించిన క్యాలెండర్లను ఆమె బ్యాంకులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఒక్కొక్క గ్రూపునకు మూడు లక్షల రూపాయలు నుండి 15లక్షల వరకు రుణాలు ఇచ్చుటకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. వ్యవసాయం, బంగారం రుణాలు కూడా ఎటువంటి అదనపు ప్రాసీసింగ్ పీజులు లేకుండా మూడు లక్షలు వరకు రుణాలు ఇస్తామన్నారు. కేవలం డబ్బయి పైసల వడ్డీతో ఇస్తామన్నారు.తీసుకొన్న రుణాలు సకాలంలో చెల్లిస్తే ఖాతా దార్లుకు నిత్యం రుణాలు ఇస్తామన్నారు. ఖాదీ బోర్డు రుణాలు ద్వారా (సబ్ సిడి)మంజూరు చేసిన యూనిట్లు సమర్ధ వంతగా నడుపుతున్నారని ఆమె అన్నారు. చిన్న చిన్న వ్యాపారం చేసుకొనే వారికీ కూడా 50వేల నుండి లక్ష రూపాయలు వరకు రుణ సహాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమం లో బ్యాంక్ అధికారులు అనిల్, బీ, దామోదర్ రావు, నా గ అ ప్పా రా వు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరిస్తున్న మేనేజర్

గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు

ప్రజాశక్తి- చీడికాడ :మండలంలో బోయపాడు గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం ఉప సర్పంచ్ కొరచా నారాయణమూర్తి ప్రారంభించారు. పాడి పశు వుల కోసం ప్రభుత్వం ఉచిత వైద్యం ఏర్పాటు చేయడం ఆనందదాయకం అన్నారు. పాడి రైతులకు కూడా లబ్ధి చేకూరుతుందన్నారు. ఖండివరం పశు వైద్య అధికారి గణేష్ రెడ్డి మాట్లాడుతూ, పాడి రైతులు పశువులకు ప్రతి సంవత్సరం టీకాలు వేయించాలన్నారు. నట్టల నివారణ మందులు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో షుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ బండారు శేషగిరిరావు, పాల కేంద్రం అధ్యక్షులు సింగంపల్లి కాసుబాబు, పాలకేంద్ర సెక్రటరీ గండి ఎర్రు నాయుడు, విఏ పాతరపల్లి సంతోష్ కుమార్ ,పశుసంవర్ధక సహాయకులు శ్రీనివాసరావు, రమేష్ పాల్గొన్నారు.

సబ్బవరం:మండలంలోని గొల్లలపాలెం, ఎల్లుప్పి శివారు మర్రిపాలెం గ్రామాల్లో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు బుధవారం నిర్వహించారు. పశు వైద్యాధికారులు జి.అరుణ, ఎస్.స్వర్ణలత, బి.సంధ్య ఈ రెండు గ్రామాల్లో 26 పశువులకు వైద్య పరీక్షలు, 32 పశువులకు గర్భకోశ వ్యాధులకి చికిత్సలు, 24 పశువులకు చూడి తనిఖీలు చేశారు. 64 దూడలకి నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో గొల్లలపాలెం సర్పంచ్ మోపాడ అప్పారావు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని ఉగ్గినపాలెం గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం బుధవారం జరిగింది. కన్నూరుపాలెం పశువైద్యాధికారి డాక్టర్ డయానా 8 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స, 53 పశువులకు, 500 గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందులు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కలగా గున్నయ్య నాయుడు, కూటమి నాయకులు కలగా సోమేశ్వరరావు, కలగా గోవిందా, కలగా శ్రీనువాసరావు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరవాడ : పాడి రైతులందరూ పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలని పశు సంవర్ధక శాఖ పరవాడ సబ్ డివిజనల్ అసిస్టెంట్ డైరక్టర్ డాక్టర్ రామకష్ణ కీర్తి పేర్కొన్నారు. మండలంలోని మంత్రిపాలెం, వాడ చీపురుపల్లి గ్రామాలలో బుధవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు జరిగాయి. పశువైద్య సిబ్బంది 215 పశు వులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో పశు వైద్యులు అశ్విని ప్రపుల్ల, సురేష్ కుమార్, 85 వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మీ ప్రసాద్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని వెల్లంకిలో బుధవారం ఉచిత పశుఆరోగ్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి వెటర్నరీ డిడి డాక్టర్ ఎం..చంద్రశేఖర్, చినగదిలి ఎడి డాక్టర్ సజ్జ శ్రీనివాసరావు పాల్గొన్నారు . ఈ సందర్భంగా బహువార్షిక పశుగ్రాస పెంపకం పథకంపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో 26 పశువులు, 46 లేగ దూడలకు నట్టల నివారణ మందులు వేయించారు. గర్భకోశ వ్యాధులు చికిత్సలు, పలుపశువులకు పేడ, రక్త నమూనాలను సేకరించి, పరీక్షలకు ల్యాబ్‌కు పంపుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.అనిల్ కుమార్, వెల్లంకి సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణ, ఉపసర్పంచ్ కంచరాపు శ్రీనివాసరావు, పిన్నింటి వెంకటరమణ, గొలగాని బాలు, కూటమి నాయకులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని కొవ్వాడ పశువైద్యశాల ఆధ్వర్యంలో గంధవరంలో, పద్మనాభం పశు వైద్యకేంద్రం ఆధ్వర్యంలో పొట్నూరు గ్రామంలోనూ. రెడ్డిపల్లి పశువైద్యాలయం ఆధ్వర్యంలో బీతాల వలస గ్రామంలోనూ బుధవారం ఉచిత పశుఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. వ్యాధినిరోధక టీకాలు, డీవార్మింగ్, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, ఉచిత మందులు, మినరల్ మిక్చర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహేష్, లక్ష్మణరావు, నాగమణి వైద్యాధికారులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలని

కారిడార్ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని వైజాగ్ -చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో ప్రభుత్వం సేకరించిన డి పట్టా, సాగు భూముల్లో చెట్లకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ కారిడార్ నిర్వాసితులు బుధవారం తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. సిపిఎం నాయకులతో కలిసి కారిడార్ నిర్వాసితులు తహసిల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. మండలంలోని రాజయ్యపేట, డిఎల్ పురం, చందనాడ, వేంపాడు, బుచ్చిరాజు పేట రెవిన్యూ గ్రామాల్లో సుమారుగా 1500 ఎకరాల వరకు డి పట్టా, సాగు భూముల్లో గల చెట్లకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జిరాయితీ భూముల్లో గల జీడి, మామిడి, కొబ్బరి తదితర చెట్లకు పరిహారం చెల్లించారని, డి ఫారం, సాగు భూములో కొబ్బరి, జీడి, మామిడి చెట్లకు నేటికీ నష్ట పరిహారం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, నర్సీపట్నం ఆర్డిఓ, స్థానిక తహసిల్దార్‌లకు చెట్లకు పరిహారం చెల్లించాలని కోరుతూ వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. అధికారులు నష్ట పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారని, హామీలు అమలు చేయకుండా డీ ఫారం, సాగు భూములలో తోటలకు, చెట్లకు నష్టపరహారం చెల్లించకుండా తొలగించడానికి సిద్ధ పడుతున్నారన్నారు. రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు ఏపీఐఐసి ఆధ్వర్యంలో రోడ్లు నిర్మాణాలు చేపట్టేందుకు గాను పనులు చేపడుతున్నారని, ఈ క్రమంలో జిరాయితీ భూములతో పాటు, డి పట్టా, సాగు భూముల్లో ఉన్న కొబ్బరి, జీడి చెట్లను యంత్రాలతో తొలగిస్తు న్నారని, డి పట్టా సాగు భూముల్లో ఉన్న చెట్లకు పరిహారం చెల్లించకుండా తొలగించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టారని, పరిహారం చెల్లించకపోవడంతో పేద రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. డి ఎల్ పురం లో సర్వే నంబర్ 85 లో సుమారుగా 110 ఎకరాల్లో 200 మంది పేద రైతులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, ఆ భూమికి, చెట్లకు సంబంధించిన నష్టపరిహారం వెంటనే చెల్లించాలని, ఇదే గ్రామంలో 28 ఎకరాలు 14 మంది పేద రైతులు సాగు చేసుకుంటున్నారని, వారికి పరిహారం చెల్లించాలని కోరారు. తహసిల్దార్ ఆర్ నరసింహమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జీ.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, ఆర్.శంకరరావు, మండల కార్యదర్శి ఎం.రాజేష్, డి ఎల్ పురం మాజీ ఎంపిటిసి సభ్యులు గింజాల వెంకట రమణ, నాయకులు ఎం.మహేష్ బాబు, బి.అప్పలరాజు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న సిపిఎం నేతలు, నిర్వాసితులు

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -నక్కపల్లి:జాతీయస్థాయి హాకీ పోటీలకు నక్కపల్లి హాకీ క్రీడాకారులు ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజన్ సెక్రటరీ శ్రీలక్ష్మి, పీడీ తరుణ్ కుమార్, బియస్ హాకీ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు సంయుక్తంగా తెలిపారు. గత ఏడాది కాకినాడలో నవంబర్ 5 6 7 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి ఎస్.జి.ఎఫ్ అండర్ -19 హాకీ క్రీడా పోటీల్లో బాలురు విభాగం లో ఎం. మణికంఠ, కె. అనిల్ కుమార్, కె. సాయిరామ్, బాలికల విభాగంలో ఎం.పూర్ణిమ ప్రతిభ కనబర్చడంతో ఆంధ్రప్రదేశ్ హాకీ జట్టుకు ఎంపికైనట్లు వెల్లడించారు. జనవరి 29 నుండి ఫిబ్రవరి 2 వ తేదీ వరకు జార్కండ్ రాజధాని రాంచిలో జరిగే జాతీయ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటారన్నారు. జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను బియస్ హాకీ క్లబ్ అధ్యక్షులు చిన్న అప్పారావు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ, కోచ్ రాంబాబు, జాతీయ సీనియర్ క్రీడాకారుడు రామచంద్రరావు, కొల్నాటి నానాజీ అభినందనలు తెలిపారు.

ఎంపికైన క్రీడాకారులు

పరిశీలిస్తున్న స్పీకర్ అయ్యన్న

పెద్ద చెరువు అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: పెద్ద చెరువును ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేసి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. బుధవారం స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో ఆర్ అండ్ బి, పర్యాటక శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.గత నవంబర్ 21న అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఇరు శాఖల అధికారులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి స్పీకర్‌కి వివరించారు. ప్రతిపాదనలను పూర్తిస్థాయిలో ఆయా శాఖల హెడ్ ఆఫీసులకు పంపించాలని స్పీకర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం స్పీకర్ అధికారులతో కలిసి పెద్ద చెరువు ప్రాంతాన్ని సందర్శించారు. పార్కింగ్, టాయిలెట్ల నిర్మాణాలు, విగ్రహాల ఏర్పాటు వంటి అంశాలపై అధికారులకు సూచనలు చేశారు.ఈ సమీక్ష సమావేశంలో ఆర్అండ్‌బి శాఖ డి.ఇ. విద్యాసాగర్, ఏ.ఇ. నారాయణరెడ్డి, టూరిజం శాఖ డి.ఇ. స్వామి, ఈఇ. రమణ, ఏఇ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల పనులు పూర్తి చేసుకోవాలి

ప్రజాశక్తి -గొలుగొండ: ఉపాధి పనుల్లో ప్రతి ఒక్కరు వంద రోజుల పని పూర్తి చేసుకోవాలని సామాజిక తనిఖీల కమిటీ డిఆర్పి వరప్రసాద్ సూచించారు. మండలంలో లింగందొరపాలెం పంచాయతీలో ఉపాధి పనులకు గాను గ్రామ సభను బుధవారం పంచాయతీ కార్యదర్శి శివ ఆధ్వర్యంలో గింజర్తి పంచాయతీ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంచాయతీలో 2023-24 సంవత్సరానికిగాను 19 రకాల పనులు ఉపాధి పథకంలో పూర్తి చేశారన్నారు. పంచాయతీలో 275 జాబ్ కార్డులు ఉండగా కేవలం 11 మంది మాత్రమే వంద రోజులు పని పూర్తి చేశారన్నారు. గ్రామంలో నాలుగు సంవత్సరాల నుండి విఆర్పి లేకపోవడమే దీనికి కారణంగా కనిపిస్తుందన్నారు. ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివ, టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాదు, గ్రామ పెద్దలు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వరప్రసాద్

చట్టాలకు ముప్పు వాటిల్లితే ఉద్యమానికి సిద్ధం

-అయ్యన్న వ్యాఖ్యలపై కూటమి నాయకులు స్పందించాలి
-పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఆదివాసీల హక్కుల, చట్టాలకు ముప్పు వాటిల్లితే పదవిని వదిలి ప్రత్యక్ష ఉద్యమానికి సిద్ధమని పాడేరు ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు అన్నారు. పాడేరు క్యాంపు కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1/70 చట్టంలో సడలింపులు చేస్తే ఇన్వెస్టర్లు ముందుకు వస్తారంటూ స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలపై మండిపడ్డారు. స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలపై కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు కనీసం స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 1/70 చట్టంపై స్పీకర్ అయ్యన్న మాటలకు కూటమి నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 1/70 భూ బదలాయింపు చట్టంపై స్పీకర్ అయ్యన్న చేసిన వ్యాఖ్యలను ఆదివాసీ సమాజం తీవ్రంగా ప్రతిఘటిస్తోందన్నారు. శాసనసభ సభాపతిగా ఆదివాసీల హక్కులు, చట్టాల పరిరక్షణకు కృషి చేయాల్సిన స్పీకర్ అయ్యన్న గిరిజనులకు రక్షణగా ఉన్న చట్టాలను మార్పు చేయాలని, సడలింపులు ఇవ్వాలని కోరడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఆదివాసీల హక్కులు, చట్టాలు జోలికొస్తే ఎవరినైనా ప్రతిఘటించక తప్పదని హెచ్చరించారు. ఆదివాసి ప్రాంత హక్కులు, చట్టాలకు తూట్లు పొడవాలని చూస్తే ఆదివాసి సమాజం ఊరుకోదన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడుపై గవర్నర్, రాష్ట్రపతికి ఫిర్యాదు చేయనున్నట్లు స్పష్టం చేశారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

పరస్పర సహకారంతో యువతకు ఉపాధి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విద్యా సంస్థలు, నైపుణ్య శిక్షణ సంస్థలు, పరిశ్రమల నిర్వాహకుల పరస్పర సహకారం, ప్రణాళికతో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను సృష్టించవచ్చని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. చదివిన చదువుకు తగ్గ ఉద్యోగం నిర్ణీత సమయంలో వచ్చేలా ప్రణాళికలు రచించాలని, ఉద్యోగ అవకాశాలకు తగ్గట్టు కోర్సులు అందించాలని ఆయా సంస్థలను కోరారు. ప్రభుత్వ సంస్థలు, ప్రయివేటు సంస్థలు సమన్వయంతో పని చేసి భవిష్యత్తులో స్థానిక యువతకు ఉపాధి మెరుగైన అవకాశాలను కల్పించాలని సూచించారు. ఇంటరాక్షన్ ఆన్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ జాబ్ క్రియేషన్ ఇన్ విశాఖపట్టణం రీజియన్ పేరుతో కలెక్టరేట్ మీటింగు హాలులో బుధవారం సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక పరిచయ సదస్సులో జిల్లా కలెక్టర్ పలు అంశాలపై మాట్లాడారు. విద్యా సంస్థలు, పరిశ్రమలు నెలకొక్కసారి ప్రత్యేకంగా సమావేశమై అవసరాలను గుర్తించి దానికి తగిన అభ్యర్థులను తయారు చేసుకోవాలని చెప్పారు. ఆయా కంపెనీల్లో అవసరాల మేరకు శిక్షణ అందించాలన్నారు. ముందుగానే విద్యా, నైపుణ్య శిక్షణ సంస్థలతో ఒప్పందాలు చేసుకొని తగిన కోర్సులు ప్రవేశ పెట్టేలా సంప్రదింపులు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సిఐఐ ప్రతినిధులు గ్రంధి రాజేశ్, మురళీకృష్ణ, పిఎస్ ఠాగూర్, నీరజ్, ఉపాధి కల్పనా అధికారి సుబ్బిరెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి, విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సహాయం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని న్యాయం పూడి గ్రామంలో ఎస్సీ కాలనీలో గోరింట నూకాలమ్మ ఇల్లు ఇటీవల ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. బుధవారం రాష్ట్ర పౌర సరఫరా శాఖ డైరెక్టర్, జనసేన నాయకులు బోడపాటి శివ దత్ చేతుల మీదుగా బాధిత కుటుంబానికి 50 కేజీలు బియ్యం, వంట సామాగ్రి, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు గోవిందరావు, ఉపమాక జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పాము గణేష్, నాయకులు కురందాసు అప్పలరాజు, ఎలమంచిలి చంద్రరావు, మహేష్, గోవిందు, శ్రీను,బంగార్రాజు, కండెల బుజ్జి, సాయి, గోవిందు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సరుకులు అందజేస్తున్న శివ దత్

హోరాహోరీగా గుర్రం పందేలు

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలోని కింతలి వల్లాపురం గ్రామంలో ఆరేళ్లమ్మ తల్లి 5వ వార్షికోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. కింతలి వల్లాపురం వారిచే కోలాటం ఏర్పాటు చేశారు. ఆలయంకు వచ్చిన భక్తులకు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన గ్రామ ప్రజల ఆర్థిక సహాయంతో నిర్వహించారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి జిల్లా స్థాయి గుర్రం పరుగుల పోటీలు హొరాహొరీగా జరిగాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

:పరుగు తీస్తున్న గుర్రం

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు
షష్ఠిపూర్తి శుభాకాంక్షలు

అతి తక్కువ ధరతో
మీ ప్రకటన
వేయబడును.

మీ సేవలు
మరువలేనివి,
మీరెక్కడున్నా
మీ శ్రేయస్సును
కోరుకుంటాం,
అందించండి.
ప్రజాశక్తి ద్వారా
శుభాకాంక్షలు

మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు,
బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు
షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా?
అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు,
ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని
ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు

మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	: 9490099125	పూర్ణమార్కెట్	: 9490099676
మధురవాడ	: 8008596645	జగదాంబ	: 9490099434
గాజువాక	: 9849392359	జివియంసి	: 9490099483
అనకాపల్లి	: 8008736188	ద్వారకానగర్	: 9490099672
చోడవరం	: 9490099141	కంచరపాలెం	: 9490099135
నర్సీపట్నం	: 9440280411	మాదవధార	: 9490099675
పాడేరు	: 9490099142		
రంపచోడవరం	: 9440165617		